# విశాల భారతి

6-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 92




## ఎప్పుడొస్తావ్ కృష్ణమ్మ?

- గుర్రంపోడు రైతుల గోస.. ఫైళ్లలోనే కృష్ణమ్మ పరుగులు
- 2008లో మొదలైన కాలువ పనులు నేటికీ అసంపూర్తం
- కాలువ మరీ లోతుగా ఉండటంతో నీరు పారడం లేదు
- ఇంకా 3 కిలోమీటర్ల మేర తవ్వకం నిలిచిపోయింది
- నీరు అందక 3 వేల ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది
- కనీసం చెరువులైనా నింపితే బోర్లకు నీరొస్తుందని ఆశ

04






- తారామతి బారాదరి రిసార్టుపై ఈగల్ టీం మెరుపు దాడి
- డ్రగ్స్ పరీక్షల్లో ఆరుగురికి పాజిటివ్.. పోలీసుల అదుపులోకి
- పోలీసుల అనుమతి లేకుండానే పార్టీ నిర్వహించిన నిర్వాహకులు
- ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో మాజీ ఎమ్మెల్యే చంచల్‌గూడ జైలుకు
- ఆరు రోజుల విచారణ తర్వాత రోహిత్ రెడ్డిని కోర్టులో హాజరు
- కస్టడీ పొడిగింపుపై రేపు నిర్ణయం తీసుకోనున్న న్యాయస్థానం

## డ్రగ్స్ అడ్డాగా హైదరాబాద్





**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరంలో మరోసారి మత్తు పదార్థాల కలకలం రేగింది. గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చారిత్రక తారామతి బారాదరి రిసార్టు వేదికగా శనివారం అర్ధరాత్రి జరిగిన ఒక ప్రైవేట్ ఈవెంట్‌పై తెలంగాణ ఈగల్ బృందం మెరుపు దాడులు నిర్వహించింది. 'మోర్ దెన్ ఫ్రెండ్స్' అనే ఆకర్షణీయమైన పేరుతో చంద్ర అనే వ్యక్తి ఈ వేడుకను ఏర్పాటు చేశారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రచారం చేసుకున్నప్పటికీ, లోపల మాత్రం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు సాగాయి. సుమారు రెండు వందల మంది యువతీ యువకులు హాజరైన ఈ పార్టీకి పోలీసుల నుంచి కనీస అనుమతులు కూడా తీసుకోకపోవడం గమనార్హం. మద్యం సరఫరా చేయడానికి ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి పొందినట్లు నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, ఈ వేడుకలో మాదకద్రవ్యాల వినియోగం జరుగుతోందని అధికారులకు ముందస్తుగా పక్కా సమాచారం అందింది. ముఖ్యంగా డ్రగ్స్ వినియోగదారుల జాబితాలో ఉండి, పోలీసుల నిఘాలో ఉన్న సస్పెక్ట్ షీట్ వ్యక్తులు ఈ పార్టీకి హాజరైనట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో రంగంలోకి దిగిన ఈగల్ డీఎస్పీ భిక్షపతి తన బృందంతో కలిసి గోల్కొండ పోలీసులను సమన్వయం చేసుకుంటూ శనివారం రాత్రి రిసార్టును చుట్టుముట్టారు. ఎవరూ తప్పించుకునే అవకాశం లేకుండా పకడ్బందీగా వ్యూహరచన చేసి లోపలికి ప్రవేశించిన అధికారులు అక్కడ జరుగుతున్న తతంగాన్ని చూసి విస్తుపోయారు.అర్ధరాత్రి సమయంలో సంగీత హోరు మధ్య సాగుతున్న ఈ పార్టీలో పాల్గొన్న వారిని ఒక్కసారిగా అదుపులోకి తీసుకున్న ఈగల్ టీం, అనుమానం ఉన్న 36 మందిని ప్రత్యేకంగా గుర్తించింది. ఆధునిక డ్రగ్ కిట్లను ఉపయోగించి అక్కడికక్కడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

మిగతా 3లో..



తీగ లాగితే డొంకంతా కదులుతుందనే సామెత ఇప్పుడు తెలంగాణలో అక్షరాలా నిజమవుతోంది. మొయినాబాద్ ప్రాంతంలో వెలుగుచూసిన ఒక మాదక ద్రవ్యాల పార్టీ ఉదంతం ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద భూ కుంభకోణాన్ని బయటపెట్టింది. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఆ పార్టీ వ్యవహారాన్ని విచారిస్తున్న అధికారులకు ఊహించని నిజాలు తెలిశాయి. ఆ విచారణ క్రమంలోనే అజీజ్‌నగర్ పరిధిలోని వేల కోట్ల రూపాయల ప్రభుత్వ భూముల అక్రమ మార్పిడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 162 ఎకరాల భూమికి సంబంధించిన ఈ వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.



# 162 ఎకరాలు ₹ 3,240 కోట్లు

## అజీజ్ నగర్‌లో రూ. 3,240 కోట్ల భూదందా వెలుగులోకి

- పేదలకు ఇచ్చిన 162 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా
- బడా నేతలు, అధికారులు ఫామ్ హౌస్‌లు కట్టినట్లు గుర్తింపు
- జీవో 111 పరిధిలో అక్రమంగా పరిశ్రమలు, కాలేజీల ఏర్పాటు
- ఇవన్నీ ప్రభుత్వ భూములేనని సీఎం రేవంత్‌కు రిపోర్ట్
- అక్రమ కట్టడాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో?

అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 177లో 1954-55 నాటి ఖాస్రా పహాణీ రికార్డులను అధికారులు పరిశీలించగా, అది స్పష్టంగా ప్రభుత్వ భూమి అని తేలింది. 162.08 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ భూమిని 1965లో అప్పటి ప్రభుత్వం కొంతమంది పేదలకు సాగు నిమిత్తం పంచింది. అసైన్డ్ భూముల నిబంధనల ప్రకారం వీటిని ఇతరులకు విక్రయించడం చట్టరీత్యా నేరం. చట్టాల మీద పూర్తి అవగాహన ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సైతం నిబంధనలను బేఖాతరు చేస్తూ ఈ భూములను కొనుగోలు చేయడం ఆశ్చర్యకరం. పేదల చేతుల నుంచి ఈ భూములు మారి, నేడు బడా వ్యాపారవేత్తల పరమయ్యాయి. ఈ భూ వివాదంపై గతంలోనే అనేక మలుపులు చోటుచేసుకున్నాయి.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

1998వ సంవత్సరంలో ఈ భూములు తమవేనంటూ కొంతమంది వ్యక్తులు తెరపైకి వచ్చి వాదించారు. ఆ సమయంలో రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి, అవి నిస్సందేహంగా ప్రభుత్వ భూములేనని స్పష్టం చేశారు. 2002లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ దారులకు నోటీసులు జారీ చేసి, పట్టాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రికార్డుల ప్రకారం ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు బోర్డులు కూడా ఏర్పాటు చేసినా, క్షేత్రస్థాయిలో మాత్రం పర్యవేక్షణ లోపించింది. ఆ భూములను రక్షించడంలో అధికారులు విఫలం కావడంతో అక్రమార్కులు చొరబడ్డారు. ప్రస్తుతం ఈ 162 ఎకరాల విస్తీర్ణంలో భారీ నిర్మాణాలు వెలిశాయి. హైదరాబాద్‌లో పేరున్న ఓ ప్రజాప్రతినిధి ఏకంగా 12.20 ఎకరాల ప్రభుత్వ భూమిని తన ఆధీనంలో ఉంచుకుని వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించుకున్నారు. చట్టసభల్లో నిబంధనల గురించి మాట్లాడే వారే ఇలా భూ కబ్జాలకు పాల్పడటం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో పట్టా రద్దయిన భూమిని వీరు ఎలా కొనుగోలు చేశారు.

మిగతా 3లో..

హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అజీజ్‌నగర్ వంటి ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రస్తుతం నగరంలో స్థిరాస్తి వ్యాపారం కొంత నెమ్మదించినా, ఈ ప్రాంతంలో ఎకరం విలువ కోట్ల రూపాయలు పలుకుతుండటం గమనార్హం. అధికారులు లెక్కించిన ప్రకారం అన్యాక్రాంతమైన ఈ 162 ఎకరాల భూమి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ.3,240 కోట్లు ఉంటుందని అంచనా. ఇంతటి భారీ విలువైన ప్రభుత్వ భూమిని కొంతమంది బడా బాబులు తమ గుప్పిట్లో ఉంచుకోవడం వెనుక ఉన్న లోతైన వ్యవస్థను రెవెన్యూ అధికారులు ఇప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



## కేసీఆర్ నన్ను గెంటేశారు

- కేసీఆర్ నన్ను పంపినా, బీఆర్ఎస్‌లోనే నా అభిమానులు
- పదవుల కోసం ఆశపడను, కమిట్‌మెంట్‌తో పనిచేస్తాను
- రేవంత్ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై నడుస్తోంది
- కాంగ్రెస్ మీడియాను, కోర్టులను కూడా మేనేజ్ చేస్తోంది
- పార్టీలు మార్చడం బట్టలు మార్చినంత సులభం కాదు
- త్వరలో 'చలో బాలాజీ నగర్' కార్యక్రమం చేపడతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఆదివారం శామీర్‌పేటలో మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ తనను బీఆర్ఎస్ నుంచి గెంటేసి ఐదేళ్లు కావస్తున్నా, నేటికీ ఆ పార్టీలో తనను అభిమానించే వారి సంఖ్య అధికంగానే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా రాజగోపాల్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు

మిగతా 3లో..

## ప్రజాస్వామ్యానికి కోర్టులు ప్రతీక

- ఇది కేవలం భవనం కాదు, న్యాయం అందించే పవిత్ర ఆలయం
- సామాన్యులు, పేదలకు న్యాయం దక్కే ఏకైక వేదిక
- రాబోయే 100 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా ఆధునిక నిర్మాణం
- ప్రభుత్వం ఏర్పడగానే తీసుకున్న అత్యంత కీలకమైన నిర్ణయం
- ఈ భారీ ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేస్తాం
- న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం, వసతులు కల్పించడం మా బాధ్యత




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర శివారులోని రాజేంద్రనగర్ పరిధిలో ఉన్న బుద్వేల్ ప్రాంతం ఆదివారం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. తెలంగాణ రాష్ట్ర నూతన హైకోర్టు భవన సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భం కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, న్యాయ వ్యవస్థ పట్ల పాలకులకు ఉన్న నిబద్ధతకు అద్దం పట్టింది. ఈ భవనం కేవలం సిమెంట్, ఇనుముతో కూడిన నిర్మాణం మాత్రమే కాదని, ఇది ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఆలయాలు, మసీదులు, చర్చీల నిర్మాణం ఎంత పవిత్రమైనదో, అన్ని మతాల ప్రజలకు సమానంగా న్యాయం అందించే ఈ న్యాయ ప్రాంగణ నిర్మాణం కూడా అంతే పవిత్రమైనదని ఆయన పేర్కొన్నారు.

మిగతా 4లో..

# సీఎం కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారు




**విశాలభారతి, హనుమకొండ:** రేవంత్ రెడ్డి సీఎం అనే స్థాయిని మర్చిపోయి కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామన్నారు. అధికార పక్షమే ప్రభుత్వ కార్యాలయాలపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ఫ్యాక్షన్ రాజకీయాలకు, దాడులకు కాంగ్రెస్ పాల్పడుతోందని విమర్శించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ సమయంలో సైతం ఈ తరహా దాడులను చూశామని, నాడు సరైన రీతిలో సమాధానం చెప్పామని, రానున్న రోజుల్లో సైతం సరైన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తుంటే. దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ ఇలాంటి దాడులకు తెగబడుతోందని ఆరోపించారు. హామీల అమలు మరచి దాడులకు తెగబడుతూ డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్ చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ ను అగమ్యగోచరంగా రేవంత్ రెడ్డి చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేరళలో పినరై విజయన్ పై మాట్లాడుతున్నారని జాతీయ రాజకీయాల్లో ముఖ్య నేతగా ఉన్న విజయన్ పై మాట్లాడే స్థాయి రేవంత్ కు లేదని చెప్పారు. కేరళలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తాను ఫ్లయిట్ ఏర్పాటు చేస్తే తెలంగాణా కు వచ్చి 6 గ్యారెంటీల అమలు చూడమంటున్నాడని, రేవంత్ రెడ్డి 6 గ్యారెంటీలు అమలు చేశాడని చూపిస్తే తాను హనుమకొండ చౌరస్తాలో ఉరి వేసుకుంటానని చెప్పారు. శాసన మండలిలో... గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ మీద చర్చ, పద్దులపై చర్చలు అత్యంత ప్రధాన అంశాలు..ఆ అంశాల మీద చర్చ సమయంలో రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్ళాడని ఆరోపించారు. శాసనసభ, శాసనమండలిలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానాలే కరువయ్యాయన్నారు. తెలంగాణ రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నవి నిజం కాదా అని ప్రశ్నించారు. గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ ఆఫీస్ లో మోడీ ఫోటో పెడుతున్నారా అని కాంగ్రెస్ వారిని ప్రశ్నించారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీ హరి ఏ పార్టీయో, ఘన్‌పూర్ ప్రజల చేత రెఫరెండం పెట్టించాలని, శ్రీహరి చిల్లరగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మేడారం లో గాయపడి గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నయువన్ అనే చిన్నారి ని మేము నిన్న పరామర్శించాము.. సీఎం తో సహా అందరూ మేడారం లో వాటాల కోసం మాత్రమే క్యాంపు పెట్టారని ఆరోపించారు. 2 టన్నుల రాయి యువన్ కాలుపై పడడడం వల్ల అతని కాలుని తీసివేశారని, నాసిరకం పనులు మేడారంలో జరిగాయని విమర్శించారు. తక్షణం ఈ ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, ఏలిమి సతీష్, పశ్చిమ నియోజకవర్గ కన్వినర్ తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్, రామ్మూర్తి, సుదర్శన్, సారిక, సౌరం రఘు, గండ్రకోట రాకేష్ యాదవ్, దొమకుంట్ల రాజ్‌కుమార్, పుల్లయ్య, మూటిక రాజు యాదవ్, సురాసి మహేష్, సంపతి రఘు, నవీన్, విజయ్ రెడ్డి, తక్కళ్లపల్లి వినీల్ రావు, మంద సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 7 వేల కోట్ల భూమిని మింగేశారు

- నాదర్‌గుల్‌లో రూ. 7 వేల కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా
- ఈ స్కామ్ వెనుక మంత్రి పొంగులేటి కుటుంబం ఉంది
- పేద రైతులను భయపెట్టి భూములు లాక్కుంటున్నారు
- ఇది ప్రభుత్వ భూమి అని గతంలో కోర్టులు స్పష్టంగా చెప్పాయి
- చెరువులను కబ్జా చేస్తున్నా హైడ్రా ఎందుకు పట్టించుకోవడం లేదు?
- అక్రమ కంచెలు కూల్చకపోతే మేమే రంగంలోకి దిగుతాం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నాదర్‌గుల్ భూముల్లో సాగుతున్న రూ. 7 వేల కోట్ల భారీ కుంభకోణంపై బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే కంచె వేసి కాజేస్తున్నారని, ఈ దందా వెనుక సాక్షాత్తూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబం హస్తముందని ఆయన బాంబు పేల్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు ఈ అక్రమాలను సాక్ష్యాధారాలతో సహా ఎండగట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, దళితుల భూములపై గద్దల్లా వాలిపోతున్నారని, రక్షకులే భక్షకులుగా మారి వేల కోట్ల విలువైన ఆస్తులను కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ పరిధిలోని సర్వే నంబర్ 613 (కొత్త సంఖ్య 119) లో విస్తరించి ఉన్న 373 ఎకరాల భూమి చుట్టూ ఇప్పుడు వివాదం ముసురుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు లేఖ మేరకు, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ భూమిని ప్రభుత్వ ఆస్తిగా అసెంబ్లీలో ప్రకటించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఆ తర్వాత ఏపీఐఐసీకి అప్పగించిన ఈ స్థలాన్ని గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కంటికి రెప్పలా కాపాడామని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డి సర్కారు కొలువుదీరిన పది రోజులకే ఈ విలువైన భూమిపై అధికార పక్షం కన్ను పడిందని, వందల మంది రైతులు సాగు చేసుకుంటున్న నేలను బౌన్సర్ల సాయంతో ఆక్రమిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమికి సంబంధించి 2017లోనే సుప్రీంకోర్టు ఇది ప్రభుత్వానిదేనని స్పష్టమైన తీర్పునిచ్చిందని హరీశ్‌రావు వెల్లడించారు. నిజాం కాలం నాటి వారసులమని చెప్పుకుంటున్న వ్యక్తుల నుంచి కొన్ని కంపెనీలు చట్టవిరుద్ధంగా ఈ భూమిని కొనుగోలు చేశాయని, ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం అసలు ఇంత భూమి ఒక వ్యక్తి వద్ద ఉండే అవకాశమే లేదని స్పష్టం చేశారు. కందుకూరు ఆర్డీవో కూడా ఈ విక్రయాలు చెల్లవని, ఇది నిషేధిత జాబితా (22A) లో ఉందని గతంలోనే తేల్చారు. హైకోర్టు సింగిల్ బెంచ్ మరియు డివిజన్ బెంచ్ కూడా ఆర్డీవో నిర్ణయాన్ని సమర్థిస్తూ, అక్రమంగా భూములు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఎలాంటి స్టే ఉత్తర్వులు లేవని హరీశ్‌రావు వివరించారు. భూభారతి వెబ్‌సైట్‌లో నేటికీ ఇది ప్రభుత్వ భూమిగానే చూపిస్తున్నా, అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. మార్చి నెలలో బాధితులు కలెక్టరుకు, హైడ్రాకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇందిరమ్మ రాజ్యం పేదలకు భూములిస్తే, ప్రస్తుత రేవంత్ రెడ్డి రాజ్యం గుండాల సాయంతో పేదల నోటి దగ్గరి కూడును లాగేసుకుంటోందని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఎప్పుడూ రాని బౌన్సర్లు ఇప్పుడు ఎందుకు వస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నానని చెప్పుకునే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఈ భారీ స్కాం ఎందుకు కనిపించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. శని, ఆదివారాలు వస్తే పేదల ఇళ్లను కూల్చేసే హైడ్రా, 373 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం వెనుక పరమార్థం ఏమిటని నిలదీశారు. 7 వేల కోట్ల భూ కుంభకోణం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని, ఇది ఆయనకు తెలియకుండానే సాగుతోందా అని అనుమానం వ్యక్తం చేశారు. అధికార బలంతో సామాన్య రైతులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. కేవలం భూమి మాత్రమే కాకుండా, అక్కడ ఉన్న లచ్చమ్మ కుంట చెరువు శిఖం భూమిని కూడా కబ్జాదారులు వదలలేదని హరీశ్‌రావు వెల్లడించారు. 17 ఎకరాల ఎఫ్టీఎల్ భూమి, 6 ఎకరాల బఫర్ జోన్‌ను ఆక్రమించి ఫీడర్ ఛానల్స్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. లచ్చమ్మ కుంట నిండితే ఆ నీరు నాన్ చెరువు నుంచి ఇంజాపూర్ మాసం చెరువు వరకు వెళ్తుందని, ఇప్పుడు ఆ నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారని ఆవేదన చెందారు. హైడ్రా రంగనాథ్ తక్షణమే అక్కడికి వెళ్లి అక్రమ కంచెలను తొలగించకపోతే, బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేలతో కలిసి తామే క్షేత్రస్థాయిలోకి వెళ్తామని హెచ్చరించారు. నాదర్‌గుల్ పరిసరాల్లోని లింగమయ్య గుట్ట మినహా మిగతా కొండలన్నీ మైనింగ్ మాఫియా మింగేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్ నడిబొడ్డున ఇంత భారీ ఎత్తున మైనింగ్ జరుగుతుంటే గనులు, రెవెన్యూ శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలపై సిట్‌లు వేయడానికి ఉత్సాహం చూపే ముఖ్యమంత్రి, తన కేబినెట్ సహచరుడి కుటుంబంపై వస్తున్న ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కబ్జాదారులకు వత్తాసు పలుకుతోందని, ఇది కేవలం అవినీతి మాత్రమే కాదని, వ్యవస్థల విధ్వంసమని ఆయన అభివర్ణించారు. ఈ భూ కబ్జా వెనుక ఉన్న కంపెనీల చిట్టాను హరీశ్‌రావు బయటపెట్టారు. కోహినూర్ గ్రూప్, శిల్పా ఇన్ఫ్రా, మెగా కంపెనీ వంటి పేర్లతో బోర్డులు మారుస్తూ భూమిని చుట్టేస్తున్నారని తెలిపారు. కంపెనీల రిజిస్ట్రేషన్ వివరాల ప్రకారం.. శిల్పా ఇన్ఫ్రా, శిల్పా రాఘవ ఎల్ఎల్‌పీలలో మంత్రి పొంగులేటి కుమారులు హర్షారెడ్డి, లోహిత్ రెడ్డితో పాటు స్వప్న రెడ్డి డైరెక్టర్లుగా ఉన్నారని సాక్ష్యాలను ప్రదర్శించారు. అలాగే క్రిస్టల్ మాన్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కూడా హర్షారెడ్డి డైరెక్టరుగా ఉన్నారని, ఇవన్నీ మంత్రి కుటుంబానికి చెందినవేనని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ మంత్రి కుటుంబమే నేరుగా భూ ఆక్రమణలకు పాల్పడుతుంటే, జిల్లా కలెక్టరు లేదా ఆర్డీవో వంటి అధికారులు వారిని ఎలా అడ్డుకోగలరని హరీశ్‌రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి హోదాలో ఉండి ప్రభుత్వ భూములను కాజేయడం నైతికంగా ఏ రకమైన పాలన అని ఆయన నిలదీశారు. ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న వారందరినీ చట్టం ముందు నిలబెట్టాలని, అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్స్‌ను హైడ్రా వెంటనే నేలమట్టం చేయాలని కోరారు.

# ఖానాపూర్ పీఠం బీజేపీ కైవసం

- బీఆర్ఎస్ మద్దతుతో బీజేపీకి చైర్మన్ పీఠం
- ఖానాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి పదవి
- ఎమ్మెల్యే మద్దతు ఉన్నా దక్కని అధికారం
- రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి
- బీఆర్ఎస్ చైర్మన్, బీజేపీ వైస్ చైర్మన్
- బీఆర్ఎస్ చైర్మన్, సీపీఐ వైస్ చైర్మన్






**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ మున్సిపల్ పీఠం ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. రాజకీయ ఉత్కంఠకు తెర దించుతూ ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చైర్మన్ పదవిని దక్కించుకుంది. గత కొంతకాలంగా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా పూర్తి చేసింది. అంకెల గారడీతో సాగిన ఈ రాజకీయంలో వ్యూహప్రతివ్యూహాలు ఫలించడంతో బీజేపీ అభ్యర్థి అంకం మౌనిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ విజయంతో ఖానాపూర్ పట్టణ రాజకీయాల్లో నూతన అధ్యాయం మొదలైనట్లయింది. మున్సిపల్ చైర్మన్ ఎంపికలో చోటుచేసుకున్న పరిణామాలు స్థానికంగా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రధానంగా బీఆర్ఎస్ మద్దతుతో బీజేపీ అభ్యర్థి గెలవడం ఇక్కడి రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా మార్చివేసింది. చైర్‌పర్సన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోగా, వైస్ చైర్మన్ పదవి బీఆర్ఎస్ పరం కావడం గమనార్హం. పదవుల పంపకంలో భాగంగా కుదిరిన ఈ ఒప్పందం కౌన్సిల్ హాల్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ వైరుధ్యాలు ఉన్నప్పటికీ, అధికార పీఠం కోసం ప్రత్యర్థి పార్టీలు చేతులు కలపడం కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉండగా, ప్రజలు ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. ఫలితాల్లో బీఆర్ఎస్ నాలుగు స్థానాలను గెలుచుకోగా, బీజేపీ కూడా అదే సంఖ్యలో నాలుగు వార్డులను తన ఖాతాలో వేసుకుంది. కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలతో సరిపెట్టుకోగా, ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. దీంతో పీఠాన్ని దక్కించుకోవడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కోసం స్వతంత్ర అభ్యర్థితో పాటు ఎక్స్ అఫీషియో ఓట్లపై పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. ఈ బలబలాల నేపథ్యంలో ప్రతి ఓటు కీలకంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు రూపంలో ఒక ఎక్స్ అఫీషియో ఓటు ఉంది. దీనికి తోడు స్వతంత్ర అభ్యర్థి కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీ బలం ఐదుకు చేరుకుంది. అయినప్పటికీ చైర్మన్ పీఠాన్ని సొంతం చేసుకోవడానికి ఆ బలం సరిపోలేదు. బీఆర్ఎస్, బీజేపీలు ఏకమై తమ ఎనిమిది మంది కౌన్సిలర్ల బలంతో కాంగ్రెస్‌ను నిలువరించాయి. ఈ సంఖ్యా బలం ముందు కాంగ్రెస్ వ్యూహాలు ఫలించలేదు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడిని ఈ ఎన్నిక మరోసారి నిరూపించింది. ఖానాపూర్ ఫలితంతో తెలంగాణ వ్యాప్తంగా సుదీర్ఘంగా సాగిన మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు ముగింపు పలికినట్లయింది. రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో పాలకవర్గాల ఎన్నికలు పూర్తి కావడంతో ఇక అభివృద్ధిపై దృష్టి సారించే అవకాశం కలిగింది. ఖానాపూర్‌లో వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన షోయబ్ ఎన్నిక కావడంతో రెండు పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉంటుందో చూడాలి. పాలనాపరమైన నిర్ణయాల్లో ఈ విభిన్న భావజాలాలు కలిగిన పార్టీలు ఎలా ముందుకు సాగుతాయనేది ఇప్పుడు పట్టణ వాసుల ఆసక్తికర అంశంగా మారింది. శనివారం జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కూడా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ పార్టీకి చెందిన టేకుల సుదర్శన్ రెడ్డి దక్కించుకున్నారు. అయితే వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలకు అవకాశం లభించింది. ఇక్కడ కూడా విపక్షాల మధ్య లోపాయికారీ ఒప్పందాలు పనిచేశాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారం కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి స్థానిక అవసరాలకు అనుగుణంగా నాయకులు నిర్ణయాలు తీసుకున్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయం మరో మలుపు తిరిగింది. ఇక్కడ బీఆర్ఎస్ తన పట్టును నిరూపించుకుంటూ చైర్‌పర్సన్ పదవిని సంధ్యారాణికి కట్టబెట్టింది. వైస్ చైర్‌పర్సన్ పదవి విషయంలో మాత్రం మిత్రధర్మాన్ని పాటిస్తూ సీపీఐ అభ్యర్థి సరితకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. దీనివల్ల వామపక్షాలతో ఉన్న అనుబంధాన్ని బీఆర్ఎస్ కొనసాగించినట్లయింది. ఈ ఎన్నికల ద్వారా మున్సిపల్ రాజకీయాల్లో ప్రాంతాలవారీగా పార్టీలు అనుసరిస్తున్న భిన్నమైన పోకడలు బయటపడ్డాయి. పురపాలక ఎన్నికల ప్రక్రియలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా ఖానాపూర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కలెక్టర్ మరియు ఎస్పీ స్థాయి అధికారులు స్వయంగా పర్యవేక్షించడంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ప్రజాస్వామ్యబద్ధంగా కౌన్సిలర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని పట్టణ ప్రథమ పౌరులను ఎన్నుకున్నారు. పాలకవర్గాలు కొలువుదీరడంతో పట్టణాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు మోక్షం లభించనుంది. ఖానాపూర్ లాంటి ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా వంటి అనేక సమస్యలు కొత్త పాలకవర్గం ముందు ఉన్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ కలయికతో ఏర్పడిన ఈ పాలకవర్గం ప్రజల ఆకాంక్షలను ఏ మేరకు నెరవేరుస్తుందో కాలమే నిర్ణయించాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి పట్టణ ప్రగతి కోసం అందరూ కలిసి పనిచేయాలని స్థానికులు కోరుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో యువత మరియు మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఒక శుభపరిణామం. ఖానాపూర్ చైర్‌పర్సన్ అంకం మౌనిక, క్యాతనపల్లి చైర్‌పర్సన్ సంధ్యారాణి వంటి మహిళా నేతలు కీలక పదవులను అధిష్టించడం మహిళా సాధికారతకు నిదర్శనం. వీరు తీసుకునే నిర్ణయాలు పట్టణాల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవినీతి రహిత పాలన అందించడం వీరి ముందున్న ప్రధాన సవాలు. కొత్త నాయకత్వంపై ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ముగింపు ఒక పెద్ద ఘట్టం ముగిసిన అనుభూతిని కలిగిస్తోంది. రాజకీయ పార్టీలు తమ బలాబలాలను పరీక్షించుకున్న ఈ పోరులో గెలుపోటములు సహజం. అధికారం ఎవరికి దక్కినా అంతిమంగా ప్రజల క్షేమమే పరమావధిగా సాగాలి. వినూత్న ఆలోచనలతో పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దే బాధ్యతను ఎన్నికైన ప్రతినిధులు స్వీకరించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన విజేతలని చాటిచెప్పేలా భవిష్యత్తు పాలన సాగాలని ఆశిద్దాం. ఖానాపూర్ నుంచి క్యాతనపల్లి వరకు ప్రతి మున్సిపాలిటీ ఇప్పుడు కొత్త వెలుగుల కోసం వేచి చూస్తోంది.

# ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి

- 5 గ్రామాలను కలపాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- భౌగోళికంగా ఆ గ్రామాలు తెలంగాణతోనే ఉన్నాయి
- ఏపీలో ఉండటం వల్ల పరిపాలన ఇబ్బందిగా మారింది
- విద్య, వైద్యం కోసం విలీనం తప్పనిసరని స్పష్టీకరణ
- తెలంగాణలో కలిపితేనే ప్రభుత్వ సాయం అందుతుంది
- ఈ పార్లమెంట్ సెషన్ లోనే విలీన బిల్లు ప్రవేశపెట్టాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



భద్రాచలం ముఖద్వారం వద్ద సరిహద్దు చిక్కుముడులు విప్పే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఐదు కీలక పంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలన్న డిమాండ్ ఇప్పుడు ఢిల్లీ వేదికగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాసిన లేఖ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. భద్రాద్రి రామయ్య సన్నిధికి అత్యంత చేరువలో ఉన్న ఈ ప్రాంతాలు ఏపీ పరిధిలోకి వెళ్లడంతో స్థానికులు పడుతున్న అవస్థలను మంత్రి తన లేఖలో సవివరంగా ఏకరువు పెట్టారు.విభజన చట్టం సవరణ ద్వారా గతంలో తెలంగాణ నుంచి ఏపీలో కలిసిన ఈ గ్రామాల విషయంలో ఇప్పుడు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల గట్టిగా నొక్కి చెప్పారు. భౌగోళికంగా ఈ ఐదు గ్రామాలు భద్రాచలం పట్టణంతో విడదీయలేని బంధాన్ని కలిగి ఉన్నాయి. కేవలం కాగితాల మీద మాత్రమే ఇవి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని, వాస్తవానికి ఇక్కడి ప్రజల జీవనగమనం అంతా తెలంగాణతోనే ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. పాలనాపరమైన సరిహద్దులు ప్రజల దైనందిన జీవితానికి అవరోధంగా మారకూడదన్నది మంత్రి లేఖలోని ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. పురుషోత్తపట్నం, ఎటపాక వంటి గ్రామాలు భద్రాచలం పట్టణానికి ఆనుకునే ఉంటాయి. ఈ గ్రామాల ప్రజలు ఉదయం లేచిన దగ్గర నుంచి పాలు, కూరగాయల కొనుగోలు మొదలుకుని ఆసుపత్రి అవసరాల వరకు భద్రాచలం మీదనే ఆధారపడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లాలన్నా, పిల్లలను స్కూళ్లకు పంపాలన్నా వారు తెలంగాణ భూభాగంలోకి రావాల్సిందే. అయితే వారు ఏపీ పౌరులుగా గుర్తింపు పొందడం వల్ల సంక్షేమ పథకాల అమలులో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రెండూ రాష్ట్రాల మధ్య నలుగుతున్న సామాన్యుల గోసను కేంద్రం అర్థం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ విలీనం ఎంతో అవసరమని తుమ్మల అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు పొందే క్రమంలో గిరిజన బిడ్డలు సరిహద్దు సమస్యల వల్ల వెనుకబడిపోతున్నారు. అత్యవసర సమయంలో గర్భిణులు, రోగులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రావాల్సి వస్తోంది కానీ, రికార్డుల పరంగా వారు ఇతర జిల్లాలకు చెందిన వారు కావడంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మానవీయ కోణంలో ఆలోచించి ఈ ఐదు గ్రామాలను తిరిగి భద్రాద్రి జిల్లాలో కలపడం ఒక్కటే సరైన పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలు ఈ సరిహద్దు గ్రామాల ప్రజలకు అందకపోవడం వల్ల వారు వివక్షకు గురవుతున్నామనే భావనలో ఉన్నారు. రైతుబంధు తరహా పథకాలు లేదా సామాజిక పించన్ల విషయంలో ఈ గ్రామస్తులు అటు ఏపీకి దూరంగా, ఇటు తెలంగాణకు చేరవ కాలేకపోతున్నారు. ఈ ప్రాంతాలను తెలంగాణలో విలీనం చేస్తే ప్రభుత్వ యంత్రాంగం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించడానికి వీలవుతుంది. పాలనను ప్రజలకు దగ్గర చేయాలన్న ప్రజాస్వామ్య లక్ష్యం అప్పుడే నెరవేరుతుందని మంత్రి తన లేఖలో కేంద్రానికి వివరించారు. వరదలు వచ్చిన సమయంలో భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. ఆ సమయంలో సహాయక చర్యలు చేపట్టడం తెలంగాణ అధికారులకు సులభం అవుతుంది కానీ, ఆ గ్రామాలు ఏపీ పరిధిలో ఉండటం వల్ల అధికారిక అనుమతులు, సమన్వయ లోపం ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. భద్రాచలం పట్టణ రక్షణ కోసం నిర్మించే కరకట్టల విస్తరణకు కూడా ఈ ఐదు గ్రామాల భూభాగం ఎంతో కీలకం. ఆ భూమి తెలంగాణ ఆధీనంలో లేకపోవడం వల్ల వరద నివారణ చర్యల్లో జాప్యం జరుగుతోందన్న విషయాన్ని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ఇదే సరైన సమయమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావుకు ఈ ప్రాంతాల మీద పూర్తి అవగాహన ఉంది. అందుకే ఆయన కేవలం రాజకీయ కోణంలో కాకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజు వేసుకుని ఈ ప్రతిపాదనను కేంద్రం ముందుంచారు. భద్రాచలం పట్టణ విస్తరణకు సైతం స్థలం కొరత వేధిస్తోంది. ఈ ఐదు గ్రామాలు కలిస్తే భవిష్యత్తులో భద్రాద్రి క్షేత్రం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పార్లమెంటు సమావేశాల్లోనే ఈ విలీన ప్రక్రియకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని తుమ్మల కోరారు. ఇది కేవలం ఒక ప్రాంతం మార్పు మాత్రమే కాదు, వేలాది మంది గిరిజన కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణలను అనుసరించి రాష్ట్రాల సరిహద్దుల మార్పు చేసే అధికారం కేంద్రానికి ఉన్నందున, వెంటనే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి అవసరమైన అన్ని పత్రాలను, నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించడానికి సిద్ధంగా ఉందని లేఖలో వెల్లడించారు.ఈ విలీన అంశం తెరపైకి రావడంతో అటు ఏపీలోనూ, ఇటు తెలంగాణలోనూ రాజకీయంగా ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ప్రజల కోణంలో చూస్తే మాత్రం విలీనం జరగాలనే వాదన బలంగా వినిపిస్తోంది. స్థానిక పంచాయతీలు కూడా గతంలో ఇదే విషయమై తీర్మానాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కేంద్రం సానుకూలంగా స్పందిస్తే భద్రాచలం చుట్టుపక్కల ఉన్న గందరగోళం తొలగిపోతుంది. పరిపాలన సౌలభ్యం కోసం గ్రామాల మార్పిడి అనేది కొత్తేమీ కాదు కాబట్టి, కేంద్ర హోంమంత్రి దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని తెలంగాణ సర్కారు ఆశిస్తోంది. మంత్రి తుమ్మల రాసిన లేఖతో ఇప్పుడు బంతి కేంద్రం కోర్టులో ఉంది. భౌగోళిక వాస్తవాలను, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ విలీనం అనివార్యమని పిస్తోంది. ఒకే కుటుంబానికి చెందిన వారు రెండు రాష్ట్రాల్లో ఉండటం వల్ల సామాజిక సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. ఉమ్మడి సంస్కృతి, భాష, జీవన శైలి కలిగిన ఈ ప్రాంతాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల శాంతిభద్రతల నిర్వహణ కూడా సులభతరం అవుతుంది. కేంద్ర హోంశాఖ ఈ లేఖపై ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

# ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 142 నూతన కార్యవర్గం ఎన్నిక

**పాల్వంచ, విశాలభారతి:** తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్ 142) ఆధ్వర్యంలో కేటీపీయస్ ఏ కాలనీలోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.వి.రామారావు అధ్యక్షత వహించారు. టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీకి సంబంధించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ పరిధిలోని కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్,కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల నుండి భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ ఉద్యోగులకు సంబంధించి యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఎన్పీడీసీఎల్ అధ్యక్షులుగా బి. దేవ్ సింగ్, ఉపాధ్యక్షులుగా బి. స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఏ.నాగరాజు, సహాయ కార్యదర్శిగా వి. మోతీలాల్, ప్రచార కార్యదర్శిగా ఆర్. యాకయ్య, కోశాధికారిగా సి.హెచ్. కిష్టయ్య, కార్యవర్గ సభ్యులుగా కె. బాలరాజు, జి. వేణు, యం. రాజు, ఎల్.బలరాం లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రామారావు మాట్లాడుతూ.. కార్మికులు కష్టించి పని చేసి సంస్థ అభివృద్ధికి చేయూతనివ్వాలని అలాగే కార్మిక సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు.



# డ్రగ్స్ అడ్డాగా హైదరాబాద్





**మొదటిపేజీ తరువాయి**

ఈ పరీక్షా ఫలితాల్లో ఆరుగురు వ్యక్తులు మాదకద్రవ్యాలు సేవించినట్లు నిర్ధారణ అయింది. యోగేశ్వర్, అబ్దుల్ సర్వర్, పరం సి నిహార్, ఆశి, జాసన్‌లతో పాటు మరొకరికి పాజిటివ్ రావడంతో అధికారులు వారిని తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తరలించడానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన చంద్ర అనే వ్యక్తిపై పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక ప్రచారం పేరుతో యువతను తప్పదోవ పట్టించి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మాదకద్రవ్యాలు అసలు ఎక్కడి నుంచి నగరానికి చేరుకున్నాయి, సరఫరాదారులు ఎవరు అనే కోణంలో లోతైన దర్యాప్తు మొదలైంది. గతంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారా లేక ఇదే మొదటిసారా అన్న కోణంలో నిర్వాహకులను విచారిస్తున్నారు. నిందితుల ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారి కాల్ డేటా ఆధారంగా ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారులను వేటాడే పనిలో పడ్డారు. ఈ సంఘటన నగరంలో సంచలనం సృష్టిస్తుండగానే, మరోవైపు మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్, కాల్పుల కేసులో ప్రధాన నిందితులైన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, రితీష్ రెడ్డి, నమిత్ శర్మల పోలీసు కస్టడీ ముగిసింది. శనివారం మధ్యాహ్నం నిందితులను రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన సిట్ అధికారులు విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. కేసు తీవ్రత దృష్ట్యా నిందితులను మరో మూడు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. విచారణ ఇంకా అసంపూర్తిగానే ఉందని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాల ప్రమేయంపై ఆధారాలు సేకరించాల్సి ఉందని సిట్ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. రోహిత్ రెడ్డి తరపు న్యాయవాదులు మాత్రం పోలీసుల విన్నపాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే ఆరు రోజుల పాటు కస్టడీలో ఉంచి విచారించారని, మళ్లీ కస్టడీ అవసరం లేదని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న న్యాయస్థానం తన నిర్ణయాన్ని సోమవారానికి వాయిదా వేసింది. అప్పటి వరకు నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించాలని జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు భారీ భద్రత మధ్య నిందితులను జైలుకు తరలించారు. ఈ కేసులో రాజకీయ కోణంతో పాటు మాదకద్రవ్యాల నెట్‌వర్క్ కూడా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. గత ఆరు రోజుల విచారణలో సిట్ అధికారులు రోహిత్ రెడ్డి నుంచి విదేశీ పర్యటనలకు సంబంధించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. మార్చి 14వ తేదీన ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో అసలు కాల్పులు ఎందుకు జరిగాయి, ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి అనే ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలపై కూడా నిఘా పెట్టారు. బెంగుళూరు, గోవా వంటి నగరాల నుంచి డ్రగ్స్ ముఠాలతో వీరికి ఉన్న సంబంధాలను ధ్రువీకరించుకోవడానికి డిజిటల్ సాక్ష్యాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో మరికొందరు ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న తరుణంలో వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు పబ్బులు, రిసార్టులపై నిఘా పెంచినప్పటికీ కొత్త రూపాల్లో మత్తు దందా సాగుతోంది.

తారామతి బారాదరి వంటి ప్రభుత్వ పర్యాటక ప్రాంతాల్లోనే ఇలాంటి పార్టీలు జరగడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని బాధ్యులైన సిబ్బందిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

యువతను ఈ వ్యసనాల నుంచి కాపాడటానికి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఈగల్ బృందం స్పష్టం చేసింది. డ్రగ్స్ సంస్కృతిని అరికట్టడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతోంది. ఈగల్ టీం వద్ద ఉన్న అధునాతన పరీక్షా కిట్లు నిమిషాల వ్యవధిలోనే ఫలితాలను ఇస్తుండటంతో నిందితులు తప్పించుకోవడం కష్టంగా మారింది. గోల్కొండ దాడుల్లో పట్టుబడిన వారు విద్యావంతులు, ఉన్నత కుటుంబాలకు చెందిన వారు కావడం గమనార్హం. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని, అర్ధరాత్రి పార్టీల పేరుతో వెళ్లే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాల సహకారం ఉంటేనే ఈ మత్తు రక్కసిని తరిమికొట్టగలమని అధికారులు పేర్కొంటున్నారు. తారామతి బారాదరి ఘటనకు సంబంధించి రిసార్ట్ యాజమాన్యాన్ని కూడా పోలీసులు విచారించే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం ప్రైవేట్ కార్యక్రమాలకు ఇచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారిని ప్రశ్నించనున్నారు. ఈ ఈవెంట్ నిర్వహించిన 'మోర్ దెన్ ఫ్రెండ్స్' గ్రూపు గతంలో ఎక్కడెక్కడ కార్యక్రమాలు చేసిందో ఆ వివరాలను సేకరిస్తున్నారు. నిందితులకు పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ కావడంతో వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కఠినమైన సెక్షన్లు నమోదు చేశారు. దీనివల్ల నిందితులకు బెయిల్ రావడం కూడా క్లిష్టంగా మారే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో మరిన్ని తనిఖీలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి హైదరాబాద్‌లోని ఈ రెండు కేసులు మత్తు పదార్థాల నెట్‌వర్క్ ఎంత లోతుగా పాతుకుపోయిందో చాటిచెబుతున్నాయి. పైలట్ రోహిత్ రెడ్డి కేసు సోమవారం కోర్టు తీర్పు తర్వాత ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి. అటు గోల్కొండలో పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రభుత్వం చెబుతోంది. నిరంతర నిఘా, కఠినమైన విచారణల ద్వారా నగరంలో శాంతిభద్రతలను కాపాడటమే తమ లక్ష్యమని పోలీసు ఉన్నతాధికారులు పునరుద్ఘాటించారు. ఈ పరిణామాలు రాజకీయంగా కూడా వేడిని పెంచుతున్నాయి.

# రేవంత్ చేతికి 162 ఎకరాలు..
# రూ. 3,240 కోట్లు





**మొదటిపేజీ తరువాయి**

రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు దీనికి ఎలా సహకరించారు అనే కోణంలో విచారణ సాగుతోంది. రాజకీయ ప్రాబల్యం ఉపయోగించి ఈ భూములపై హక్కులను కల్పించుకున్నట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. మరోవైపు చెన్నైకి చెందిన ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త ఇక్కడ 15.3 ఎకరాల్లో ఒక పరిశ్రమను స్థాపించారు. విచిత్రమేమిటంటే, ఈ ప్రాంతం జీఓ 111 పరిధిలోకి వస్తుంది. పర్యావరణ నిబంధనల ప్రకారం అక్కడ భారీ పరిశ్రమలు స్థాపించడానికి అనుమతులు ఉండవు. కానీ, ప్రభుత్వ భూమి కావడంతో పాటు నిషేధిత ఉత్తర్వులు ఉన్నప్పటికీ అక్కడ పరిశ్రమ వెలిసిందంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు. అధికారుల కళ్లు గప్పి లేదా వారి సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణాలు సాగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేల కోట్ల విలువైన ఈ సామ్రాజ్యం నిబంధనల ఉల్లంఘన పునాదుల మీద నిర్మితమైంది. అంతేకాకుండా ఒక ప్రముఖ వ్యాపారవేత్త రాజకీయ నాయకుడిగా చలామణి అవుతూ ఇక్కడ 11.4 ఎకరాల్లో ఒక భారీ విశ్వవిద్యాలయాన్ని నిర్మించారు. విద్యను బోధించే సంస్థలే ఇలా అక్రమంగా సంపాదించిన భూముల్లో వెలవడం గమనార్హం. మరో వ్యక్తి ఏకంగా అతిపెద్ద పాఠశాలను ఇక్కడ ఏర్పాటు చేసి వ్యాపారం సాగిస్తున్నారు. నాడు భూమిని పొందిన పేద సాగుదారులు ఎవరూ ఇప్పుడు అక్కడ కనిపించకపోవడం గమనార్హం. వారందరినీ భయపెట్టో లేదా తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసో ఈ బడా వ్యక్తులు దర్జాగా అనుభవిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని తమ సొంత ఆస్తిగా మార్చుకున్న తీరు విస్మయానికి గురి చేస్తోంది. రెవెన్యూ శాఖ అధికారులు తాజాగా క్షేత్ర స్థాయిలో పర్యటించి ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. సర్వే నంబర్ 177లోని ప్రతి ఎకరం భూమి ఎవరి అధీనంలో ఉంది, అక్కడ ఏ నిర్మాణాలు వెలిశాయి అనే అంశాలను నివేదికలో పొందుపరిచారు. ఈ నివేదికను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన హైడ్రా వంటి సంస్థల ద్వారా అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో, ఈ 3,240 కోట్ల భూ కుంభకోణం పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిబంధనలను అతిక్రమించిన వారిలో అధికార పార్టీకి చెందిన వారు కూడా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఏ చిన్న పొరపాటైనా అది భారీ నష్టానికి దారితీస్తుందనడానికి అజీజ్‌నగర్ ఉదంతమే నిదర్శనం. గత రెండు దశాబ్దాలుగా ఈ భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నా, స్వాధీనం చేసుకోవడంలో జరిగిన జాప్యం కబ్జాదారులకు వరంగా మారింది. పేదలకు కేటాయించిన భూమిని బడా బాబులు ఆక్రమించుకోవడం సామాజిక న్యాయానికి విరుద్ధమని రెవెన్యూ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కఠిన చర్యలు తీసుకోకపోతే శివారు ప్రాంతాల్లోని మిగిలిన ప్రభుత్వ భూములు కూడా ఇదే రీతిలో మాయమయ్యే ప్రమాదం ఉంది. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం ఈ కుంభకోణం బయటకు రావడంతో మొయినాబాద్ ప్రాంతంలోని ఇతర సర్వే నంబర్లపై కూడా అధికారులు దృష్టి సారించారు. రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో దొరికిన ఆధారాలు ఈ భూదందా మూలాలను కదిలించాయి. నిందితుల ఫోన్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. రాజకీయ పలుకుబడితో భూములు కాజేసిన వారి వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచకుండా బహిర్గతం చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయం రాష్ట్రంలో భూ అక్రమాలకు పాల్పడే వారికి ఒక హెచ్చరికలా ఉండాలని సామాన్యులు కోరుకుంటున్నారు.

## దళారుల మాయకు లొంగొద్దు – ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను పొందండి

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



**విశాలభారతి, నల్లబెల్లి:** రైతులు దళారుల వద్ద ధాన్యం అమ్మి నష్టపోకూడదని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సంపేట నియోజకవర్గంలో డెబ్బై వేల ఎకరాలకు పైగా, నల్లబెల్లి మండలంలో పదిహేనువేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుందని తెలిపారు. దళారుల కారణంగా రైతులు క్వింటాలుకు ఏడు నుంచి ఎనిమిది వందల రూపాయల నష్టం చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా వ్యవసాయ శాఖతో చర్చించి, క్వింటాలుకు వచ్చే నష్టాన్ని ప్రభుత్వం భరిస్తూ మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని అన్నారు. నర్సంపేట, దుగ్గొండి, నెక్కొండ, నల్లబెల్లి మండలాల్లో ప్రభుత్వం ప్రత్యక్షంగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రూపాయలు రెండు వేల నలభై మద్దతు ధర ప్రభుత్వ కేంద్రాల్లో అందుబాటులో ఉందని గుర్తుచేశారు. రైతులు పూర్తిగా ఎండబెట్టిన నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురాగానే తగిన లబ్ధి పొందగలరని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, మార్క్ఫెడ్ డిఎం రంజిత్ రెడ్డి, సర్పంచ్ నాగేల్లి జ్యోతి ప్రకాష్, వ్యవసాయ అధికారులు రజిత, శ్రీకాంత్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, నాయకులు తిరుపతి రెడ్డి, చరణ్ సింగ్, మహేష్, అఖిల్, మల్లయ్య, కొమురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుడు కుటుంబానికి ఆర్థిక సహాయం.

**విశాలభారతి, పర్వతగిరి :** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన దాడి సదానందం భార్య దాడి కవిత ఇటీవల మరణించడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం బాల్య మిత్రులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.16,000/ (పదహారు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో పడిదల ఆనంద్ రావు, జుట్టుకొండ కర్ణాకర్, అమడగాని రాజు యాదవ్, కరిమిల్ల రాజు, బాల్లె రవి, తోపుచర్ల అనిల్ రావు, గారే రవి, కొంగ రాజు, పోకల కుమార్, అమడగాని రమేష్, నాల్లం రాజు, కరిమిల్ల దేవేందర్ రావు, రాసూరి రాజు, శ్రీరాముల శ్రీనివాస్, మార్గం రవీందర్, వడ్డె దుర్గయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి కష్టకాలంలో కుటుంబానికి తోడుగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థులు కూడా కవిత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# కేసీఆర్ నన్ను గెంటేశారు



**మొదటిపేజీ తరువాయి**

వంటి నేతలు తనతో చర్చించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ సమయంలోనే వారు కాంగ్రెస్‌లో చేరదామని తనను ఆహ్వానించారని, ఒకవేళ తాను గనుక వారి మాట విని ఉంటే ఈ పాటికి మంత్రిగానో లేదా ఉప ముఖ్యమంత్రిగానో కొనసాగేవాడినని ఆయన వ్యాఖ్యానించారు. తనకు పదవుల మీద ఆశ లేదని, కేవలం ప్రజల కోసం, ధర్మం కోసమే తాను పోరాడుతున్నానని ఈటెల స్పష్టం చేశారు. తెలంగాణ సమాజానికి తన వ్యక్తిత్వం ఏంటో బాగా తెలుసని, కొందరు పనిగట్టుకుని తాను పార్టీ మారుతున్నట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఈటెల కొట్టిపారేశారు. పార్టీలు మార్చడం అనేది బట్టలు మార్చుకున్నంత సులభమైన విషయం కాదని, ఆ తప్పుడు సంప్రదాయానికి తాను వ్యతిరేకమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో 25 ఏళ్ల పాటు సుదీర్ఘంగా ప్రయాణించిన నేపథ్యం ఉండటంతోనే అక్కడ తనను ఇంకా గౌరవించే వారు ఉన్నారని విశ్లేషించారు. ఈటెలను దూరం చేసుకుని కేసీఆర్ పెద్ద తప్పు చేశారని నేడు ప్రజలు చర్చించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. తనను కేవలం పార్టీ నుంచి పంపడమే కాకుండా, తన వ్యాపారాలను దెబ్బతీస్తూ కోళ్ల ఫామ్‌లను కూల్చివేయడం, చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములను స్వాధీనం చేసుకోవడం వంటి వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని, సమయం వచ్చినప్పుడు తన సత్తా ఏంటో చూపిస్తానని హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దానిని కప్పిపుచ్చుకోవడానికే మీడియాను మేనేజ్ చేస్తూ అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నారని ఈటెల విమర్శించారు. తాము ఆరుగురు బీజేపీ ఎంపీలం ఉన్నామని, త్వరలోనే ఎమ్మెల్యేలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే 'చలో బాలాజీ నగర్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నామని, అక్కడ తమ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని జోస్యం చెప్పారు. పదవుల కోసం ఆరాటపడే వ్యక్తిని కాదని చెప్పడానికి గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన ప్రతిపాదనలే నిదర్శనమని పేర్కొన్నారు. నాడు వైఎస్సార్ కోరుకున్న మంత్రి పదవి ఇస్తానని ఆఫర్ ఇచ్చినా, తెలంగాణ ఉద్యమం పట్ల ఉన్న నిబద్ధతతో తాను ఆ వైపు వెళ్లలేదని ఈటెల గుర్తుచేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రాజకీయాలపై తనకు పూర్తి అవగాహన ఉందని, డివిజన్ అధ్యక్షులుగా ఎవరిని నియమించాలో తనకు తెలియదా అని ప్రశ్నించారు. హుజూరాబాద్ నియోజకవర్గం తన పరిధిలోకి రాదని కొందరు అంటున్నారని, ఎన్నికల సమయంలో తాను అటు వెళ్లలేదని స్పష్టం చేశారు. గతంలో తాను అక్కడ బాధ్యతల్లో ఉన్నప్పుడు మున్సిపల్ చైర్మన్, జెడ్పీటీసీ స్థానాలను కోల్పోలేదని, అయితే ఈసారి ఆ నియోజకవర్గంలో జోక్యం చేసుకోవద్దని చెప్పడం వల్లే తాను మౌనంగా ఉన్నానని వివరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కేవలం గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తామని, పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన పార్లమెంట్ పరిధిలోని సమస్యలతో పాటు సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ఇప్పటికే ప్రధాని మోదీకి లేఖ రాశానని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం అబద్ధాల పునాదుల మీదనే గద్దె నెక్కారని, ఆయన పాలన కూడా అదే తీరుగా సాగుతోందని ఈటెల ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తానని, దోచుకున్న సొమ్మును కక్కిస్తానని హామీ ఇచ్చిన రేవంత్, ఇప్పుడు ఆ ఊసే ఎందుకు ఎత్తడం లేదని నిలదీశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేవలం అనవసర మాటలు మాట్లాడుతున్నారని, భూముల ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కోర్టులను సైతం మేనేజ్ చేసే స్థాయికి ప్రస్తుత పాలన దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని హామీ ఇచ్చారని, హుజూరాబాద్ డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజలు కోరితే తాను ముందుండి పోరాటం చేస్తానని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి కేవలం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఈటెల హెచ్చరించారు. పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని నమ్మవద్దని, తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవ్వడమే తన లక్ష్యమని, అధికార పార్టీ తీరును ఎండగట్టడంలో వెనకడుగు వేసేది లేదని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ఉంటానని, కేసీఆర్ వంటి వారు ఎన్ని ఇబ్బందులు పెట్టినా తలవంచలేదని గుర్తు చేశారు. భవిష్యత్తులో బీజేపీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేస్తూ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేస్తామని ఈటెల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే క్రమంలో భాగంగానే తాము క్షేత్రస్థాయి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, ప్రతి డివిజన్ స్థాయిలో పార్టీని పటిష్టం చేస్తామని ఈటెల వెల్లడించారు. ప్రజల గొంతుకగా నిలవడమే తన బాధ్యతని, ఇందుకు తన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు పూర్తి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, తనపై చేసిన ఆరోపణలు, తన ఆస్తుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, పరిపాలన గాలికి వదిలేసి రాజకీయ వ్యూహాలకే పరిమితమయ్యారని ఈటెల విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో సామాన్యుడి పరిస్థితి దయనీయంగా మారిందని ఈటెల ఆరోపించారు. రాష్ట్రంలోని రైతులు, కార్మికులు నేడు తీవ్ర నిరాశలో ఉన్నారని, వారి తరపున గళం ఎత్తేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని చెప్పారు. మీడియాను ఉపయోగించుకుని ప్రభుత్వం తప్పుడు గణాంకాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, కానీ వాస్తవాలు ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తానని, ఏ శక్తులకూ లొంగిపోయే ప్రసక్తే లేదని భీష్మించుకున్నారు. రానున్న కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని, అందుకు అనుగుణంగా తమ ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

# మంగళవారం ఇరాన్‌కు నరకమే

- 48 గంటల్లో జలసంధి తెరవకపోతే ఇరాన్‌కు నరకమే
- ఇరాన్ భూభాగంలో చిక్కుకున్న పైలట్‌ను కాపాడిన యూఎస్
- శత్రువుకు చిక్కకుండా సొంత విమానాలను కూల్చిన అమెరికా
- యూఏఈ, కువైట్‌లపై ఇరాన్ డ్రోన్ల వర్షం, ప్లాంట్లలో మంటలు
- హార్ముజ్ మూసివేతతో చమురు సంక్షోభం, భారత నౌక సేఫ్
- బీరుట్ శివార్లలో ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

మధ్యప్రాచ్యం ప్రస్తుతం ఒక అగ్నిగుండంలా మారింది. అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్ , ఇరాన్ మధ్య సాగుతున్న సుదీర్ఘ పోరాటం ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ గల్ఫ్ ప్రాంతంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా ఇరాన్ అనుసరిస్తున్న దూకుడు వైఖరిని అడ్డుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగారు. తాజాగా ఆయన ఇరాన్‌కు ఇచ్చిన అల్టిమేటం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. కేవలం 48 గంటల సమయం ఇస్తున్నామని, ఈలోపు హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవకపోతే ఇరాన్ మునుపెన్నడూ చూడని వినాశనాన్ని చూడాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మంగళవారం రోజున ఇరాన్‌లో పవర్ ప్లాంట్లు, వంతెనలు అన్నీ ఒకేసారి నేలమట్టం అవుతాయని, ఆ దెబ్బకు ఆ దేశం నరకాన్ని ప్రత్యక్షంగా చూస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ తన పంతాన్ని వీడకపోతే ఆ దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా భారీ దాడులు తప్పవని అమెరికా హెచ్చరించింది. హార్ముజ్ జలసంధి అనేది ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన మార్గం కావడంతో, దానిని మూసివేయడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని ఇరాన్ చూస్తోంది. దీనిని అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్ పర్వత ప్రాంతాల్లో అత్యంత సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ ఒకటి విజయవంతంగా ముగిసింది. శత్రువుల కళ్లుగప్పి అమెరికా బలగాలు ఇరాన్ గడ్డపైకి వెళ్లి తమ ఎయిర్‌మ్యాన్‌ను కాపాడుకున్నాయి. ఇరాన్ భూభాగంలో కుప్పకూలిన ఎఫ్15 యుద్ధ విమానానికి చెందిన ఒక కర్నల్‌ను సుమారు 36 గంటల పోరాటం తర్వాత సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఆపరేషన్‌లో రక్షించబడిన రెండో పైలట్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. అమెరికా సైనికుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న వేళ, వారిని క్షేమంగా తీసుకురావడం ద్వారా తమ సైనిక పటిమను ట్రంప్ ప్రభుత్వం నిరూపించుకుంది. ఈ భారీ ఆపరేషన్ వెనుక ఇజ్రాయెల్ నిఘా సంస్థల పాత్ర ఎంతో కీలకమని తెలుస్తోంది. ఇరాన్ గడ్డపై అమెరికా పైలట్ ఎక్కడ ఉన్నాడో కచ్చితమైన సమాచారాన్ని ఇజ్రాయెల్ అందించడంతోనే ఈ రెస్క్యూ సాధ్య



మైంది. అయితే ఈ క్రమంలో అమెరికా తన సొంత విమానాలను తానే ధ్వంసం చేసుకోవాల్సి వచ్చింది. రెస్క్యూ కోసం వెళ్లిన రెండు భారీ ఎంసీ130జే రవాణా విమానాలు అక్కడ చిక్కుకుపోవడంతో, ఆ అధునాతన సాంకేతికత ఇరాన్ చేతికి చిక్కకుండా ఉండేందుకు అమెరికా బలగాలు వాటిని పేల్చేశాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రతినిధులు ధృవీకరించారు. అయితే ఇరాన్ మాత్రం భిన్నమైన వాదనలను వినిపిస్తోంది. అమెరికా చేపట్టిన ఈ రెస్క్యూ ఆపరేషన్ పూర్తిగా విఫలమైందని ఆ దేశ సైన్యం ప్రకటించింది. ఇస్ఫహాన్ నగరానికి దక్షిణాన ఉన్న ఒక పాత విమానాశ్రయం వద్ద అమెరికా బలగాలను అడ్డుకున్నామని వారు చెబుతున్నారు. ఈ ఘర్షణలో అమెరికాకు చెందిన రెండు సి130 విమానాలతో పాటు రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు కూడా కూలిపోయాయని ఇరాన్ సైన్యం వెల్లడించింది. దీనికి సంబంధించి కొన్ని శిథిలాల వీడియోలను కూడా ఇరాన్ మీడియా విడుదల చేసింది. అమెరికా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఇరాన్ పదేపదే చెబుతోంది. యుద్ధం కేవలం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యనే పరిమితం కాకుండా గల్ఫ్ దేశాలందరినీ చుట్టుముడుతోంది. ముఖ్యంగా యూఏఈ లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. ఆదివారం ఒక్కరోజే సుమారు 60 ప్రక్షేపకాలను ఇరాన్ ప్రయోగించడం తీవ్ర కలకలం సృష్టించింది. ఇందులో తొమ్మిది శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులు ఉండటం గమనార్హం. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు యూఏఈపై వేల సంఖ్యలో డ్రోన్లు, వందల సంఖ్యలో క్షిపణులతో దాడులు జరిగాయని ఆ దేశ రక్షణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈ దాడుల వల్ల సామాన్య ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దాడుల ప్రభావంతో అబుదాబిలోని ఒక ప్రముఖ పెట్రోకెమికల్ ప్లాంట్‌లో భారీగా మంటలు చెలరేగాయి. ఆకాశమంతా నల్లటి పొగ కమ్ముకోవడంతో స్థానికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. పొరుగునే ఉన్న బహ్రెయిన్ దేశంలోని ఒక కర్మాగారంలో సైతం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు కువైట్ వైపు కూడా దూసుకురావడంతో ఆ దేశం అప్రమత్తమైంది. కువైట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సకాలంలో స్పందించి ఆ క్షిపణులను గాలిలోనే అడ్డుకోవడంతో పెద్ద ముప్పు తప్పింది. నిరంతరం సైరన్ల మోతతో గల్ఫ్ నగరాలు దద్దరిల్లిపోతున్నాయి. హార్ముజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ భారత నౌకలు ధైర్యంగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. చమురు సంక్షోభం తలెత్తకుండా ఉండేందుకు గ్రీన్ ఆశా అనే భారతీయ ఎల్పీజీ ట్యాంకర్ సురక్షితంగా జలసంధిని దాటి గమ్యం చేరుకుంది. అలాగే ఇరాక్ నుంచి ముడి చమురును మోసుకెళ్తున్న ఓషన్ థండర్ అనే నౌక కూడా విజయవంతంగా బయటపడింది. అయితే సరఫరా మార్గాలు మూసుకుపోయే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు రవాణా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతాయి. దక్షిణ లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్ తన దాడులను మరింత తీవ్రం చేసింది. హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా బీరుట్ నగర శివార్లపై బాంబుల వర్షం కురిపిస్తోంది. అంతర్జాతీయ నిబంధనలను బేఖాతరు చేస్తూ హిజ్బుల్లా దాడులకు తెగబడుతోందని, అందుకే తాము ధీటుగా సమాధానం ఇస్తున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్ వైపు వచ్చిన అనేక ఇరాన్ క్షిపణులను ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయి. ఇరు పక్షాల మధ్య ఏ క్షణంలోనైనా సంపూర్ణ యుద్ధం ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయుధాల మోతతో ఆ ప్రాంతం మొత్తం వణికిపోతోంది. మరోవైపు శాంతి స్థాపన కోసం అంతర్జాతీయంగా దౌత్య ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈజిప్ట్ విదేశాంగ మంత్రి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఇరాన్ ప్రతినిధులతో రహస్యంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఒమన్ దేశం కూడా అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమైంది. యుద్ధాన్ని ఆపి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ప్రపంచ దేశాలు కోరుతున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో కూడా కువైట్ ఎయిర్‌వేస్ భారత్‌కు విమాన సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించడం కాస్త ఊరటనిచ్చే అంశం. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రపంచ శాంతికి సవాలుగా మారాయి. అగ్రరాజ్యం అమెరికా హెచ్చరికలకు ఇరాన్ తలొగ్గుతుందా లేదా తన దూకుడును కొనసాగిస్తుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. మంగళవారం నాటి డెడ్ లైన్ దగ్గర పడుతుండటంతో అందరి దృష్టి ఇరాన్ వైపే ఉంది. యుద్ధం గనుక ముదిరితే అది కేవలం ఆ మూడు దేశాలకే పరిమితం కాకుండా ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. మానవాళి క్షేమం కోరి నాయకులు వివేకంతో నిర్ణయం తీసుకోవాలని అంతర్జాతీయ సమాజం ఆకాంక్షిస్తోంది. రానున్న 48 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయి.

# ‘ప్రజాస్వామ్యానికి కోర్టులు ప్రతీక’






**మొదటి పేజీ తరువాయి**

ఆధునిక హంగులతో రూపుదిద్దుకోనున్న ఈ సముదాయం భావితరాలకు న్యాయ స్ఫూర్తిని అందించే దీపశిఖగా నిలుస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల జీవితంలో ఇలాంటి గొప్ప అవకాశాలు రావడం చాలా అరుదని, ముఖ్యంగా న్యాయస్థానాల వంటి వ్యవస్థల బలోపేతానికి పునాది వేయడం తన అదృష్టమని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడారు. భారతదేశంలో వైవిధ్యమైన సంస్కృతులు ఉన్నప్పటికీ, వాటన్నింటినీ కలిపి ఉంచేది రాజ్యాంగం, ఆ రాజ్యాంగం ప్రసాదించిన న్యాయం మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. గతంలో అనేక ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు గురించి ఆలోచించి ఉండవచ్చు గానీ, అది కార్యరూపం దాల్చే అవకాశం తమ ప్రభుత్వానికే దక్కడం చరిత్రలో నిలిచిపోయే అంశమని తెలిపారు. ఈ మహత్తర కార్యంలో దేశంలోని అగ్రశ్రేణి న్యాయ కోవిదులతో పాలుపంచుకోవడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు సీఎం వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు అనేవి మూడు కీలక స్తంభాలని, ఇవి పరస్పర గౌరవంతో ముందుకు సాగినప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని సీఎం ఉద్ఘాటించారు. సామాన్య పౌరుడు తన సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నప్పుడు, అతనికి కనిపించే ఆఖరి ఆశాకిరణం న్యాయస్థానమేనని ఆయన విశ్లేషించారు. అందుకే న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం అంటే పరోక్షంగా సామాన్యుడికి భరోసా ఇవ్వడమేనని ప్రభుత్వం నమ్ముతోంది. ఈ కొత్త భవనం కేవలం న్యాయమూర్తులు, న్యాయవాదుల కోసమే కాకుండా, న్యాయం కోసం వేచి చూసే బాధితుల ఆవేదనను తీర్చే శాంతి నిలయంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న అత్యంత ప్రాధాన్యత కలిగిన నిర్ణయాల్లో హైకోర్టు నూతన భవన నిర్మాణం ఒకటని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2023 డిసెంబర్ నెలలో బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, న్యాయవ్యవస్థకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టును కేవలం ఒక ప్రాంతీయ భవనంగా కాకుండా, దేశంలోనే అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన న్యాయ సముదాయంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, రాబోయే వంద సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భారీ నిర్మాణానికి రూపకల్పన చేసినట్లు ఆయన వెల్లడించారు. బుద్వేల్‌లో కేటాయించిన 100 ఎకరాలకు పైగా భూమిలో ఈ ప్రాజెక్టు రెండు జోన్లుగా విభజించబడింది. జోన్ 1లో కోర్టు కార్యాలయాలు, ప్రధాన భవనాల పనులు ఇప్పటికే వేగంగా కొనసాగుతుండగా, జోన్ 2లో నివాస సముదాయాల కోసం తాజాగా శంకుస్థాపన జరిగింది. 2027 డిసెంబర్ నాటికి ఈ మొత్తం నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం రాజధానిలోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 49 కోర్టుల భవన నిర్మాణ పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయని సీఎం తెలిపారు. న్యాయ వ్యవస్థకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం కార్యనిర్వాహక శాఖగా తమ బాధ్యతని, ఇందులో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో అణగారిన వర్గాలు, పేదలు, బలహీన వర్గాల వారు తమకు అన్యాయం జరిగినప్పుడు ధైర్యంగా ఈ న్యాయ మందిరంలోకి అడుగుపెట్టాలని సీఎం కోరారు. రాబోయే శతాబ్ద కాలం పాటు ఈ భవనం వేలాది మంది బాధితుల కన్నీళ్లను తుడిచే వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పులనే కాకుండా, న్యాయమూర్తులు చేసే పరిశీలనలను, వ్యక్తం చేసే అభిప్రాయాలను కూడా ప్రభుత్వం అత్యంత గౌరవిస్తుందని ఆయన చెప్పారు. వ్యవస్థల మధ్య విభేదాలు ఉండకూడదని, అందరి లక్ష్యం ప్రజా శ్రేయస్సే కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అద్భుత నిర్మాణం ప్రజాస్వామ్యానికి ఒక శక్తివంతమైన పిల్లర్‌గా మారుతుందని ఆయన దృఢంగా నమ్ముతున్నారు. ఆధునిక మౌలిక వసతులతో పాటు పర్యావరణ హితంగా ఈ భవన సముదాయం రూపుదిద్దుకోనుంది. నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులు, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా రాజేంద్రనగర్ ప్రాంతాన్ని ఎంపిక చేయడం వెనుక లోతైన ఆలోచన ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఇక్కడ నిర్మించబోయే నివాస సముదాయాలు న్యాయమూర్తులకు, సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించనున్నాయి. భవిష్యత్తులో డిజిటల్ కోర్టుల నిర్వహణకు వీలుగా హైస్పీడ్ ఇంటర్నెట్, ఆధునిక డేటా సెంటర్లను కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. ఇది కేవలం భవనం కాదు, న్యాయ విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయవ్యవస్థ పాత్ర అమోఘమని, కార్యనిర్వాహక వ్యవస్థ ఎప్పుడూ దానికి అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. న్యాయమూర్తులు ఇచ్చే ప్రతి తీర్పు వెనుక సమాజ హితం ఉంటుందని, దాన్ని అమలు చేయడం ప్రభుత్వాల విధి అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత న్యాయవ్యవస్థలో వస్తున్న ఈ మార్పులు చారిత్రాత్మకమని ఆయన విశ్లేషించారు. భవిష్యత్తులో తెలంగాణ హైకోర్టు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని, ఇక్కడి నుండి వచ్చే తీర్పులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావాలని ఆయన ఆకాంక్షించారు. న్యాయం అనే స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిందని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా తగ్గబోమని సీఎం భరోసా ఇచ్చారు. నిర్మాణ సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, నిర్ణీత గడువులోగా ప్రజలకు ఈ న్యాయ దేవాలయాన్ని అంకితం చేస్తామని చెప్పారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, వంతెనలు కాదని, రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను గౌరవించడం కూడా అని ఆయన నూతనోత్సాహంతో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో న్యాయవాదులకు కూడా అవసరమైన వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# ఎప్పుడొస్తావ్ కృష్ణమ్మ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల రైతుల పాలిట ఆ కాలువ ఒక అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ రికార్డుల గణంకాల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతల కళ్లల్లో కన్నీళ్లే మిగులుతున్నాయి. పదేండ్ల సుదీర్ఘ నిరీక్షణ, పందొమ్మిది కోట్ల ప్రజాధనం ఖర్చు చేసినా సాగునీటి కల సాకారం కాకపోవడం పాలకుల ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఎక్కడో ఎగువన ఉన్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అంచునే నీరు ఆగిపోతుంటే, తమ భూములకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని రైతులు ఆకాశం వైపు దీనంగా ఎదురుచూస్తున్నారు. సాగునీటి కోసం రైతులు చేస్తున్న ఆర్తనాదం పాలకుల చెవిన పడటం లేదు. పెద్దవూర మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గుర్రంపోడు మండలానికి సాగునీరు అందించాలనే మహత్కార్యంతో 7బీ డిస్ట్రిబ్యూటరీ హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభమయ్యాయి. కోట్ల రూపాయలు వెచ్చించి కాలువలు తవ్వినా చుక్క నీరు రాక ఆయకట్టు ఎండిపోవడం బాధాకరం. నిధులు మంజూరై పనులు జరిగినట్లు కాగితాల్లో కనిపిస్తున్నా, నేల తల్లి దాహం మాత్రం తీరడం లేదు. రైతులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతున్నారు. ఈ ప్రాజెక్టు నేపథ్యం పరిశీలిస్తే అధికారుల ప్రణాళికా లోపం స్పష్టంగా కనిపిస్తుంది. దాదాపు పదహారేళ్ల క్రితం 2008లో ఈ కాలువ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. అప్పట్లో సుమారు 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 18 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకానికి అనుమతులు లభించాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగడం, మధ్యలో నిధుల కొరత వంటి కారణాలతో ప్రాజెక్టు అటకెక్కింది. 2018లో రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా నీటిని విడుదల చేసినట్లు చూపించినా, అది కేవలం ఆరంభ శూరత్వానికే పరిమితమైందని స్థానికులు విమర్శిస్తున్నారు. సాంకేతికపరమైన తప్పిదాలు ఈ కాలువ శాపంగా మారాయి. సాధారణ కాలువలకు భిన్నంగా ఈ 7బీ డిస్ట్రిబ్యూటరీని సుమారు 9 నుంచి 12 మీటర్ల లోతున తవ్వడం ప్రధాన అడ్డంకిగా మారింది. ఇంత లోతుగా తవ్వడం వల్ల నీరు గ్రావిటీ ద్వారా సహజంగా ప్రవహించి పొలాలకు చేరడం కష్టతరమైంది. భూగర్భంలోకి కాలువ వెళ్లడంతో కేవలం వర్షపు నీరు లేదా ఊటలు చేరడం తప్ప, రిజర్వాయర్ నుంచి నేరుగా కృష్ణమ్మ జలాలు రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. లోతైన కాలువ లోపల నీరు ఉన్నా అది పైనున్న పొలాలకు ఎలా చేరుతుందనే కనీస జ్ఞానం అధికారులకు లేకపోవడం విడ్డూరం. నిర్మాణంలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితులు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. మైలాపురం నుంచి తానేదార్‌పల్లి వరకు కాలువ తవ్వకం పూర్తయినా, అక్కడి నుంచి తేనపల్లి చెరువు వరకు తవ్వాల్సిన మరో 3 కిలోమీటర్ల పని పెండింగ్‌లో ఉంది. ఈ చిన్నపాటి పని పూర్తి కాకపోవడం వల్ల సుమారు 3 వేల ఎకరాల ఆయకట్టు ఎడారిగా మారుతోంది. గతంలో మిగిలిన 5 కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నా, పనులు ముందుకు సాగకపోవడం వెనుక ఉన్న మర్మమేంటో అర్థం కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతుల శ్రమ వృథా అవుతోంది. వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్న వేలాది కుటుంబాలు నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. సాగునీరు పక్కన పెడితే కనీసం ఈ కాలువ ద్వారా గ్రామాల్లోని చెరువులనైనా నింపాలని రైతాంగం వేడుకుంటోంది. చెరువులు నిండితే చుట్టుపక్కల భూగర్భ జలాలు పెరిగి, బోరు బావుల ద్వారా అయినా పంటలు పండించుకుంటామని వారు ఆశిస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి తవ్విన కాలువ వల్ల ప్రయోజనం లేకపోతే అది కేవలం రాళ్లకుప్పగానే మిగిలిపోతుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రజాధనం ఇలా వృథా అవుతుంటే పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఏకేబీఆర్ వద్ద గ్రావిటీ లెవల్‌లో ఉన్న లోపం వల్ల నీరు కేవలం 10 కిలోమీటర్ల దూరం వరకు మాత్రమే ప్రవహిస్తోంది. దీనివల్ల దిగువన ఉన్న గ్రామాల రైతులకు అన్యాయం జరుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా రిజర్వాయర్ వద్ద మోటార్లను ఏర్పాటు చేసి ప్రెజర్‌తో నీటిని లిఫ్ట్ చేసే ప్రతిపాదనను అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలని రైతులు కోరుతున్నారు. కాలయాపన చేసే కొద్దీ పెట్టుబడులు పెరగడమే తప్ప రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుర్రంపోడు మండల రైతుల కష్టాలు తీరాలంటే ప్రభుత్వ పెద్దలు మనసు పెట్టాలి. కేవలం ప్రతిపాదనలు సిద్ధం చేయడం, సర్వేల పేరుతో కాలం గడపడం వల్ల ప్రయోజనం ఉండదు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్‌లో ఉన్న 3 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తి చేయాలి. అధికారుల చెబుతున్నట్లుగా మోటార్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి, చివరి ఎకరా వరకు సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే ఈ హైలెవల్ కెనాల్ ఆ ప్రాంత రైతులకు నిజమైన వరప్రదాయినిగా మారుతుంది. లేదంటే ఆ ప్రాంత భూములు శాశ్వతంగా బీళ్లుగా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉంది. రైతు సంక్షేమం గురించి వేదికల మీద మాట్లాడే నాయకులు క్షేత్రస్థాయిలో ఉన్న ఇలాంటి సమస్యలపై దృష్టి సారించాలి. ప్రతి ఏటా బడ్జెట్‌లో సాగునీటి రంగానికి కేటాయిస్తున్న నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయో సమీక్షించుకోవాలి. పందొమ్మిది కోట్లు ఖర్చు చేసిన తర్వాత కూడా ఒక మండలంలోని రైతులకు నీరు అందించలేకపోవడం పాలనాపరమైన వైఫల్యమే అవుతుంది. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల సామాన్య రైతులు బలి కావాల్సి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మేల్కొని గుర్రంపోడు రైతుల కన్నీళ్లు తుడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంకేతిక సమస్యలను సాకుగా చూపి కాలం వెళ్లదీయకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నీటిని మళ్లించే మార్గాలను వెతకాలి.

# కంగ్టిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**విశాలభారతి, కంగ్టి:**



కంగ్టి మండల కేంద్రంలో మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యేసుక్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుకొని తెల్లవారుజామున భక్తులందరూ కలిసి ఊరి బయట ఉన్న సిలువ వరకుభారీ ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు పాడుకుంటూ సిలువ దగ్గరకువెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ సుధాకర్ దేవుని సందేశం వినిపించారు. యేసుక్రీస్తు శిలువ మరణాన్ని పొంది మానవాళి పాపాల్ని క్షమించడానికే భూమిపై మళ్లీ అవతరించారని పేర్కొన్నారు. ప్రేమ, సహనం, శాంతిని పంచిన కరుణామయుడు యేసుక్రీస్తు అని, ఆయన ప్రేమస్వరూపుడని పేర్కొన్నారు. అనంతరం ఊరి బయట ఉన్న సిలువ దగ్గర నుండి స్థానిక సిఐ ఆఫీస్ ముందున్న సిలువ దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిని దూషించిన ప్రతాప్ రెడ్డిపై పీఎస్ లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

- సీఎం రేవంత్ రెడ్డితో లబ్ధి పొందిన వంటేరు గతాన్ని మరవడం సిగ్గుచేటు
- రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని తొలగిస్తూ వైరల్ చేసిన ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి

**విశాలభారతి, గజ్వేల్ :**



గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో తాము ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని తొలగిస్తూ ప్రతాప్ రెడ్డి వైరల్ చేయడాన్ని నిరసిస్తూ గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం అతనిపై కేసు నమోదు చేయాలని గజ్వేల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం గజ్వేల్, కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరిలు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పట్ల అగౌరవంగా మాట్లాడడంతో పాటు ఆయన చిత్రపటాన్ని అగౌరవ పరుస్తూ విసిరే ప్రయత్నం చేశారని, ఆయన ఏ హోదాలో తొలగించారో ప్రజలకు తెలుపాలని నిలదీశారు. టీడీపీ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి ద్వారా లబ్ధి పొందిన వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రస్తుతం ఆయనను దూషించడం తిన్నింటి వాసాలు లెక్కించడమే అవుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ లో చేరిన ప్రతాప్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేయాలని రేవంత్ రెడ్డి కాళ్లు మొక్కిన విషయాన్ని మరిచిపోయావా ప్రతాపరెడ్డి అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే ఎలక్షన్ల సందర్భంగా కేసీఆర్, హరీశ్ రావులను తిట్టిన తిట్టు తిట్టకుండా దూషించిన వంటేరు ప్రతాప్ రెడ్డి, ఇప్పుడు వారి చంకలో చేరి కాంగ్రెస్ పై విమర్శలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు అంక్షా రెడ్డి లక్ష్యంగా విమర్శలు చేస్తున్న ప్రతాప్ రెడ్డి అవినీతి, అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కనకయ్య గౌడ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, కౌన్సిలర్లు, గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, సంతోష రాములు గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, నాయకులు సారిక శ్రీనివాస్ రెడ్డి, మహేష్, కోడకండ్ల బాలు తదితరులు పాల్గొన్నారు.

# వడగళ్ల బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే షకీల్**



**నిజామాబాద్, విశాలభారతి:** వడగళ్ల వర్షాలతో పంటల దెబ్బ తిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ డిమాండ్ చేశారు ఆదివారం సాలూరు మండలంలోని హోంసా మంద ధర్నా ఖాజాపూర్ గ్రామాలలో ఆయన పర్యటించారు వడగళ్ల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు మామిడి తోటలు మక్క పంటలను పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు మంజీరా తీర ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు వరదల కారణంగా పంటల దెబ్బతిన్న రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని అన్నారు తాజాగా వడగళ్ల వర్షాల వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం తక్షణమే సర్వే చేయించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు రైతులకు పరిహారం ఇవ్వకపోతే వారి పక్షాన ఆందోళనలో చేస్తామని స్పష్టం చేశారు ఆయన వెంట టిఆర్ఎస్ నాయకులు గిర్ధవర్ గంగారెడ్డి నరేంద్రబాబు భవానిపేట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

# బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**




**దేవరుప్పుల, విశాలభారతి:** భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు,హరిత విప్లవ ప్రదాత,ప్రముఖ రాజనీతిజ్ఞుడు,భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్.బాబు జగజ్జీవన్‌రామ్ 119వ జయంతిని పురస్కరించుకొని దేవరుప్పుల మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించిన జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని,దేశంలోని దళితులకు చిహ్నంగా బాబుజీగా మారారని,ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 5న ఆయన జయంతి వేడుకలను దేశ వ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసారపు ధర్మరెడ్డి,తోటకూరి పాండుకృష్ణ,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్,మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్,ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల ఉప్పలయ్య, ఓడపెల్లి పుల్లయ్య,భూక్యా యాద, మాజీ ఎంపీటీసీ మహ్మద్ జాకిర్,మండల నాయకులు బోనగిరి యాకస్వామి,దావేరా అనిల్,జక్కుల గంగరాజు, గుగులోతు రాజేందర్,దౌపాటి నర్సయ్య,పులిపంపుల భాస్కర్,పారిపెల్లి శ్రీనివాస్,బానోత్ భాస్కర్,పరీదుల భాస్కర్,సంగి కుమార్,బానోత్ రాంచంద్రు,పులిగిల్ల శోభన్ బాబు,బుర్ర ప్రభాకర్,మేడ సాగర్,మేడ ఉప్పలయ్య,నల్ల రాజు,చింత ఉపేందర్,కనివేణి అంజయ్య, మంద అశోక్,రాములన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని పురపాలక కార్యాలయంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగదాల పావని రమేష్ గౌడ్ పుష్పాంజలి ఘటించి మహనేతకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్తగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. తన పరిపాలనా దక్షతతో దేశానికి ఉప ప్రధానిగా సేవలందిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో వంతిక ప్రోమో రన్ విజయవంతం

**43 ఏళ్ల ఉపాధ్యాయుడి 10 కే పూర్తి ప్రత్యేక ఆకర్షణ**




**జనగాం, విశాలభారతి:** ఆదివారం ఉదయం 6 గంటలకు బతుకమ్మ కుంట వద్ద ప్రారంభమైన అవంతిక ప్రోమో రన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా 2కె 5కె 10కె విభాగాలలో రన్నింగ్ నిర్వహిస్తూ, ప్రజల్లో ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. పలు వయస్సుల వారు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అనేకమంది విజయవంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా యువ అథ్లెట్లకె పరిమితమైన 10కె విభాగంలో 43 ఏళ్ల ప్రభుత్వ ఉపాధ్యాయుడు శివగామి కిరణ్ కుమార్ పాల్గొని అందరిని ఆశ్చర్యపరిచారు. హరిజన కాలనీ నిర్మల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాయి ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే బతుకమ్మ కుంట నుండి శామీర్పేట వరకు 10 కిలోమీటర్ల దూరాన్ని కేవలం ఒక గంటలో పూర్తిచేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ బాధ్యతలకు మధ్య సమయం కేటాయించి ప్రాక్టీస్ లేకుండానే 10కె పూర్తి చేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు. విజేత కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఫిట్ గా ఉండాలని యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు జనగాం జిల్లాలో మరింతగా నిర్వహిస్తే ప్రజల్లో ఆరోగ్యం, మరియు చైతన్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# సామాజిక న్యాయానికి అంకితమైన మహనేతకు ఘన నివాళులు

**ఎల్‌బీనగర్‌లో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు – జక్కిడి రఘువీర్ రెడ్డి**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** స్వాతంత్ర సమరయోధుడు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనేత బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ రింగ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకుడు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలనే ఆయన ఆశయం నేటికీ మార్గదర్శకంగా ఉందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చూపిన సేవామార్గం యువతకు ఆదర్శమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. సమసమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆడాల రమేష్, నరసింహ, యాదగిరి, జయంత్, రాములు, నర్సయ్య, నవీన్, సతీష్, వరుణ్ గౌడ్, సాయి గౌడ్, మణికంట, వెంకటేష్ తదితరులు పాల్గొని బాబూజీకి ఘనంగా అంజలి ఘటించారు.

# పాల్వంచలో ఘోర రోడ్డు ప్రమాదం

**కార్పొరేటర్ కుమారుడు విక్కీమృతి..విజయలక్ష్మికీ తీవ్ర గాయాలు**



**పాల్వంచ, విశాలాభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదంచోటచేసుకుంది.పాల్వంచ పోలీస్ స్టేషన్ సమీపంలో వేగంగా వచ్చిన ఒక కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బుల్లెట్ బైక్‌పై ప్రయాణిస్తున్న తల్లి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. పాల్వంచ లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి,,ఆమె కుమారుడు విక్కికి . ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి, తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.దురదృష్టవశాత్తు, ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు విక్కీ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విజయలక్ష్మి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన అనంతరం కారు ఆపకుండా వేగంగా వెళ్లిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి కారణమైన కారును మరియు డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

# వడగండ్లు.. కడగండ్లు

- **వడగళ్ల వర్షా లతో దెబ్బతిన్న పంటలు**
- **కన్నీటి పర్యంతమవుతున్న రైతులు**



**నిజామాబాద్, విశాలభారతి:**

బోధన్ డివిజన్ పరిధిలో వడగళ్ల వర్షాలు కడగలను మిగిల్చి వెళ్తున్నాయి వడగళ్ల వర్షాలు రైతుల కంట కన్నీటిని మిగిల్చుతున్నాయి శనివారం రాత్రి సాలూరు మండలంలోని ఓన్స మందన్న ఖాజాపూర్ శివారులో కురిసిన వడగళ్ల వర్షాలు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి 10 రోజుల వ్యవధిలో బోధన్ డివిజన్ పరిధిలో వడగళ్ల వర్షాలు రైతులకు కడగలను మిగిల్చాయి పది రోజుల క్రితం డివిజన్ పరిధిలోని రుద్రూర్ మండలం చిక్కడపల్లి రానంపల్లి సులేమాన్ ఫారం శివార్లలో వడగళ్ల వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నాయి తాజాగా శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షాలు ఈదురుగాలులు సాలూరు మండలంలో పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి అరటి మక్క మామిడి జామ తోటలతో పాటు వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది వడగళ్ల వర్షాల వల్ల పంటలు నేలకొరిగి తీవ్రంగా నష్టపోయాయి వందలాది ఎకరాలలో వడగళ్ల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో పంటలను ప్రకృతి వెంటాడుతుంది వరదల కారణంగా సీజన్ ప్రారంభంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి గోదావరి మంజీరాలకు పెద్ద ఎత్తున వరదవుత్పత్తి రావడంతో సుమారు పది రోజులపాటు పంటలు నేలకొరిగాయి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి వరదల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు ఈ కష్టాలను మర్చిపోకముందే వడగళ్ల వర్షాల రూపంలో ప్రకృతి మళ్లీ రైతులను వెంటాడుతుంది పంటలు చేతికి వచ్చి అమ్ముకునే సమయంలో వడగళ్ల వర్షాలు కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నాడు వరదలు నేడు వడగల్లు తమ జీవితాలతో ఆడుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు ప్రకృతి కన్నెర చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

ఈ ఏడాది పంటలను ప్రకృతి కన్నీరుగా చేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు ప్రభుత్వమే ఆదుకోవాలని వాపోతున్నారు ఇప్పటికే వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎలాంటి పరిహారం అందలేదని రైతులు చెప్పుకొస్తున్నారు వడగళ్ల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు చూపుతూ రైతులు కన్నీరు పెడుతున్నారు వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు నయా పైసా పరిహారం అందకపోగా తిరిగి మళ్ళీ వడగళ్ల వర్షాల రూపంలో పంటలు దెబ్బతిన్నాయని తమని ప్రభుత్వమే ఆదుకోవాలని రైతాంగం డిమాండ్ చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించి పరిహారం అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# యువత ఫోన్లో కాకుండా మైదానంలో గడపాలి

- **ప్రభుత్వాలకు ధీటుగా క్రికెట్ మైదానాన్ని నెలకొల్పడం అభినందనీయం**
- **కేశాపూర్ లో గ్రౌండ్ ను ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**నిజామాబాద్, విశాలభారతి:**



యువత తమ సమయాన్ని ఫోన్లో కాకుండా మైదానంలో గడపాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. కేశాపూర్ లో వైద్యులు అభినవ్, కిరణ్ కుమార్, చైతన్య కుమార్, ప్రశాంత్ రెడ్డి లు ఏర్పాటు చేసిన రాకెట్స్ క్రికెట్ గ్రౌండ్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేవలం వైద్యమే కాకుండా యువత కోసం క్రికెట్ మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అయితే ఆశించిన స్థాయిలో సౌకర్యాలు లేకవడం క్రీడాకారులకు శాపంగా మారిందనన్నారు. జిల్లాలో ఎటువంటి సౌకర్యాలు లేకున్నా అంతర్జాతీయ స్థాయిలో ఆయా క్రీడా అంశాల్లో రాణిస్తున్న క్రీడాకారులు ఎందరో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ... జిల్లాలో మాత్రం స్టేడియం లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే తాను స్టేడియం విషయం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. అలాగే యువత డ్రగ్స్, మద్యం వైపు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. అలాగే అన్ని పార్టీల నాయకులు కలిసి కట్టుగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, నగర మేయర్ ఉమారాణి, డీసీ పీ బస్వారెడ్డి, కేశాపూర్ సర్పంచ్ గంగాధర్, డాక్టర్ మోతీలాల్, బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

# జీసస్ లవ్ చర్చ్

- **ఈస్టర్ పండుగ వేడుకలు**
- **ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు**

**నిజామాబాద్, విశాలభారతి:**



నిజామాబాద్ నగరంలోని 18వ డివిజన్ ముభారక్ నగర్ లో జీసస్ లవ్ చర్చ లో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.చర్చ పాస్టర్:ఆనంద్,దైవాజనురాలు రాణి పాల్గొని యేసు క్రీస్తు యొక్క వాగ్దానాలు భక్తులకు తెలుపుతూ ఈస్టర్ పండుగను క్రైస్తవులు యేసుక్రీస్తు పునరుత్థానానికి(మరణం నుంచి తిరిగి లేవడం) ప్రతీకగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. గుడ్ ఫ్రైడే నుంచి ఈస్టర్ ఆదివారం వరకు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు,సేవా కార్యక్రమాలతో ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. తెల్లవారుజామునే సమాధుల వద్ద కొవ్వొత్తులతో ప్రార్థనలు,చర్చిలలో ప్రత్యేక ఆరాధనలు, కుటుంబ సమేతంగా ఆనందాన్ని పంచుకోవడం ఈస్టర్ వేడుకల్లో ప్రధానాంశాలు.

**ఈస్టర్ వేడుకల విశేషాలు (మన తెలంగాణ & ఇతర కథనాల ప్రకారం):**

ప్రత్యేక ప్రార్థనలు: ఈస్టర్ ఆదివారం తెల్లవారుజామున చర్చిలలో ప్రత్యేక 'పునరుత్థాన ఆరాధనలు' నిర్వహిస్తారు.యేసు మరణాన్ని జయించి సజీవుడిగా లేచాడనే నమ్మకంతో 'హల్లెలూయ' గీతాలతో చర్చిలు మారుమోగుతాయి. సేవా కార్యక్రమాలు: పండుగ రోజున పేదలకు ఆహారం, వస్త్రదానం చేయడం, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలను సందర్శించి బహుమతులు పంచడం వంటి సేవా కార్యక్రమాలను క్రైస్తవులు ఘనంగా చేపడతారు. ఆహార సంస్కృతి (ఈస్టర్ విందు): 40 రోజుల ఉపవాస దీక్ష ముగింపుగా ఈస్టర్ నాడు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక వంటకాలతో విందు చేసుకుంటారు. కేకులు,సాంప్రదాయ వంటకాలు ఈ పండుగలో భాగం. ఈస్టర్ సందేశం: ఈస్టర్ కేవలం సంబరం మాత్రమే కాదు, ఇది ప్రేమ, క్షమాగుణం,శాంతి మరియు నిరీక్షణకు ప్రతీకగా నిలుస్తుంది.

# మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడచుకోవాలి

- **సర్పంచ్ రామావత్ భీమి బాయి**
- **కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్**

**జహీరాబాద్:**

దేశంలో సామాజిక న్యాయ సాధనకు గొప్ప కృషిచేసిన సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్.బాబు జగ్జీవన్ రామ్, 118 జయంతి పురస్కరించుకొని కోహిర్ మండలంలోని పీచేర్యాగడి పాత తాండ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రామావత్ భీమి బాయి,కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, మాట్లాడుతూ..ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే,మరోవైపు సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం ఆలుపెరగని సమరం సాగించిన యోధుడు సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత కులరహిత సమాజం కోసం తన జీవితాంతం కృషి చేసిన బడుగు బలహీనవర్గాల నేత మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫక్కు సింగ్,రామావత్ సోమ్లా నాయక్, కేతావత్ కిషన్,రామావత్ వకీల్,రామావత్ పరశురామ్,బానోత్ రాములు,రామావత్ లక్ష్మణ్, రవి,ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# మొయినాబాద్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులు**



**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్‌తో పాటు డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బేగరి రాజు, కోడిజుట్టు శ్రీనివాస్, యాదగిరి, ప్రవీణ్, గుర్రాల భాస్కర్, చాకలి శ్రీనివాస్, కృష్ణరావు తదితరులు, అలాగే యువజన సంఘాల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**ముషీరాబాద్,విశాలభారతి:** మారుతున్న జీవన శైలి వల్ల శారీరక శ్రమ తగ్గి మానసిక ఒత్తిడి పెరుగుతుందని దీనివల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా దేశ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని తార్నాక డివిజన్ లాలాపేట్ లోని కీర్తి టవర్స్, లక్ష్మీ నగర్ లో శాంతి ఎన్క్లేవ్ లో ఓపెన్ జిమ్ లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వ్యాయామం ఆవశ్యకత పెరిగిందని ప్రతి రోజు యోగా వ్యాయామం వాకింగ్ జాగింగ్ వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ శరీరానికి తగిన శ్రమ కల్పించి ఫిట్టుగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి శ్రీనివాస్, జి గోపాల్, అరుణ్ కుమార్, వెంకట్ రాజు, లక్ష్మణ్ రావు, సాయికుమార్, శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, నాగరాజు, నరేష్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనే లక్ష్యం



**కప్పాటి పాండురంగా రెడ్డి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో భారత మాజీ ఉప ప్రధాని, బాబూజీగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాండురంగా రెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, స్వతంత్ర భారత నిర్మాణంలోనూ జగ్జీవన్ రామ్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. కుల వివక్ష లేని సమాజం కోసం, దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అపారమని తెలిపారు. రక్షణ, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశానికి అందించిన సేవలు విశిష్టమని, ముఖ్యంగా హరిత విప్లవం ద్వారా దేశ ఆహార భద్రతలో ఆయన ముద్ర చెరగనిదని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దిశానిర్దేశంలో బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను సాకారం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిరంతరం శ్రమిస్తూ, వెనుకబడిన వర్గాల గొంతుకగా నిలవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. యువతకు ఆయన ఆశయాలను తెలియజేస్తూ, సమసమాజ నిర్మాణ దిశగా ముందుకు సాగడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని కప్పాటి పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని బాబూజీకి ఘనంగా అంజలి ఘటించారు.

# ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా, ప్రిన్స్ కార్నర్ వద్ద షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ చేసిన సంస్కరణలు అనిర్వచనీయమని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెల మహనీయుల మాసమని, ఈ నెలలో జ్యోతిరావ్ పూలే, బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల జయంతులను జరుపుకుంటామని తెలిపారు. దళితులకు సమాన అవకాశాలు కల్పించడంలో జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఆదర్శమని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లాడుతూ 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా సేవలు అందించారని, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని ప్రోత్సహించి దేశ ఆహార భద్రతకు తోడ్పడ్డారని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కూడా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్: కొత్వాల

**పాల్వంచ విశాలభారతి:**

స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ మాజీ ఉప ప్రధాన మంత్రి దివంగత బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా ఆదివారం పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పాల్వంచ బస్టాండ్ వద్ద వద్ద గల జగ్జీవన్ విగ్రహానికి కొత్వాల తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ దేశంలో సమ సమాజ స్థాపన కోసం జగ్జీవన్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలోని బడుగు వర్గాల ప్రజలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సముచిత స్థానం లభించినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కార్పొరేటర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాల్వ భాస్కర రావు, మహీపతి రామలింగం, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, నాయకులు గద్దల రమేష్, కొత్తపల్లి సోమయ్య, షేక్ బాషా, పైడిపల్లి మహేష్, వుండేటి శాంతి వర్ధన్, చింతా నాగరాజు, బండి నాగరాజు, దేవి లాల్, కొమ్రరాజు విజయ్, వుండేటి ఏసుపాదం, కార్పొరేటర్లు కొత్వాల విమల దేవి, సీరపు సుగుణ, దంతేబోయిన నరేష్, నూకల సరిత, హోలీ శ్రీను, డాక్టర్ BS రావు, తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ బాబు జగజీవన్ రామ్‌కి భారతరత్న ఇవ్వాలి

**సర్పంచ్ పూనెం కృష్ణ దొర**

**భద్రాచలం, విశాలభారతి:**



స్థానిక కుర్రాజులగుట్ట బేడ బుడగ జంగం కాలనీ బాబు జగజీవన్ రామ్ ప్రాంగణంలో షెడ్యూల్ కులాల జేఏసీ ఆధ్వర్యంలో 119 వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా షెడ్యూల్ కులాల జేఏసీ నాయకులు సీనియర్ అడ్వకేట్ అవులూరి సత్యనారాయణ, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణదొర, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ చింతిరాల రవికుమార్, కవి, గాయకులు , పాత్రికేయులు ,జేఏసీ నాయకులు గద్దం సుధాకర్, అర్థ వెంకటేశ్వరరావు, వార్డు నెంబర్ కారం దుర్గారావు, న్యాయవాది చల్ల శివ కృష్ణ, ప్రముఖ హేతువాది డాక్టర్ భానుప్రసాద్, షెడ్యూల్ కులాల జేఏసీ అల్లాడి పౌల్ రాజ్, అలవాల రాజా పెరియార్, లు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి చిన్నపిల్లలకు బిస్కెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అలవాల రాజా పెరియార్ అధ్యక్షత వహించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమం ఉద్దేశించి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ దొర, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ చింతిరాల రవికుమార్, షెడ్యూల్ కులాల జేఏసీ నిర్వాహకులు ప్రముఖ న్యాయవాది అవులూరి సత్యనారాయణ, ప్రముఖ ప్రతివాది డాక్టర్ భాను ప్రసాద్ లు మాట్లాడుతూ.... విద్యార్థి దశ నుండే కుల వివక్షకు వ్యతిరేకంగా ధైర్యంగా స్వరం ఎత్తి, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన మహానేత బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తి నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని, స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి, స్వాతంత్ర్యం అనంతరం దేశానికి ఉపప్రధానిగా సేవలందిస్తూ ఆధునిక భారత నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన ఈ మహనీయుడు సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని,అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తి ప్రసాదిస్తూ ముందుకు నడిపిస్తున్నాయని కోట్లాది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఈ మహానుభావునికి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించాలని వారు అన్నారు. డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా షెడ్యూల్ కులాల జేఏసీ పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం ప్రజలకు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల జేఏసీ నాయకులు కవి, గాయకులు, పాత్రికేయులు, గద్దం సుధాకర్, అలవాల రాజా పెరియార్, ఏవి రావు, అల్లాడి పౌల్ రాజ్, న్యాయవాది చల్ల శివ కృష్ణ, వార్డ్ నెంబర్ కారం దుర్గారావు, బేడ బుడగ జంగం యూత్ నాయకులు వీరేశలింగం, భాస్కర్, ముత్యాలు, నరసింహ, సమ్మయ్య, వీరస్వామి, రమేష్, చిరంజీవి, మరియు గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ పండ్ల మార్కెట్ పరిశీలనకు హరీష్ రావు రాక

**నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలని మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పిలుపు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నేడు రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకోనుంది. మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు కోహెడ పండ్ల మార్కెట్‌ను పరిశీలించేందుకు నేడు ఉదయం విచ్చేయనున్నట్లు రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఉదయం 09:00 గంటలకు కోహెడ పండ్ల మార్కెట్ వద్దకు చేరుకోవాలని ఆయన మీడియా ప్రకటనలో కోరారు. మార్కెట్ పరిస్థితులు, రైతుల సమస్యలను హరీష్ రావు స్వయంగా పరిశీలించనున్న నేపథ్యంలో భారీ స్థాయిలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థి, యువజన నాయకులు మరియు బంటి యూత్ ఫోర్స్ సభ్యులు ఉదయం 09:00 గంటలలోపు బొంగుళూరు ORR వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కోహెడకు కలిసి బయలుదేరుతామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ, నాయకులు మరియు కార్యకర్తలు సమయానికి హాజరై ఐక్యతను చాటాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్‌పల్లి డివిజన్ ఆరంఘర్ చౌరస్తా మరియు రాజేంద్రనగర్ బుద్వేల్ చౌరస్తాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్తగా, తన పరిపాలనా దక్షతతో అఖండ భారతానికి విశేష సేవలు అందించిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడినవి ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ గారు భారతదేశానికి చేసిన విశేష సేవలను కొనియాడుతూ, ఆ మహానుభావుడి సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మరియు డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బాబు జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## డీవీటీ, పీఈపై అవగాహన కోసం క్రికెట్ మ్యాచ్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** కాళ్ల నరాల్లో వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ సొసైటీ అఫ్ వసక్యూలర్ అండ్ ఎండువాసక్యూలర్ సర్జన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మణికొండలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీప్ వేయిన్ త్రోంబోసిస్ (డీవీటీ), పుల్మనరీ ఎంబోలిజం (పీఈ) వంటి ప్రమాదకర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా లకేసిదే లీగ్ స్పోర్ట్స్ కేఫ్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు రాజీవ్ కనకళ ముఖ్య అతిథిగా హాజరై వైద్యులతో కలిసి క్రికెట్ ఆడారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. కాళ్లలో వాపులు, నొప్పి, రక్త గడ్డలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. డీవీటీ, పీఈ వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం కలగవచ్చని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పంజాల రామకృష్ణ, ప్రేమ్ చంద్ గుప్తా, నిషాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మ్యాచ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

## ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వములు గల పార్టీ బిజెపి

**బౌద్ధ నగర్ బిజెపి అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి:**



భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నేడు సోమవారం ఘనంగా జరుపుకోనున్నారు. అధికారిక వేడుకలకు ముందు రోజే బౌద్ధనగర్ డివిజన్ లోని ప్రతి బూత్‌లో, ప్రతి బస్తీలో పార్టీ కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగిందని బౌద్ధ నగర్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు; జాతీయ సేవ, జాతీయత, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిబద్ధత అనే విలువలతో ముందుకు సాగే ఒక మహత్తర జాతీయ ఉద్యమం. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త "దేశం ముందు – పార్టీ తరువాత – స్వయం చివర" అనే భావంతో, పార్టీ సిద్ధాంతాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే సంకల్పంతో ముందుకు సాగలని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు.నలభై ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని నలభై ఆరు సంవత్సరంలోకి అడుగుపెడుతున్న భారతీయ జనతా పార్టీ, ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా నిలవడం మనందరికీ గర్వకారణమని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు.విశాలమైన సభ్యత్వ బలం, దాదాపు ఇరవై ఒక్క రాష్ట్రాల్లో ప్రభుత్వాలతో భారతీయ జనతా పార్టీ భారతీయ రాజకీయాల్లో శక్తివంతమైన శక్తిగా అవతరించిందని బౌద్ధనగర్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ అభివృద్ధి పార్టీపై, దాని నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసం, నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని . ఈరోజు భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ సంస్థ మాత్రమే కాదు; దేశ భవిష్యత్తును మలిచే ఒక శక్తివంతమైన జాతీయ ఉద్యమంగా నిలిచిందని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు. ఈరోజు భారతీయ జనతా పార్టీ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాక, రాబోయే కాలంలో కూడా భారతీయ జనతా పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలు నిర్ణయించుకున్నట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. నిజానికి, అటల్ బిహారీ వాజపేయి, నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రులైన తర్వాతనే భారత్ నిజమైన ఆర్థిక మార్పును, అభివృద్ధి యొక్క కొత్త యుగాన్ని చూడడం ప్రారంభించింది. వారి నాయకత్వం దేశానికి కొత్త దిశను చూపి, అభివృద్ధిని వేగవంతం చేసి, మరింత బలమైన, ఆత్మనిర్భరమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి పునాది వేసిందని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు.కాబట్టి, ఈ సందర్భంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలను, డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను, ముఖ్యంగా కాశ్మీర్ కోసం ఆయన చేసిన త్యాగాన్ని మనం స్మరించుకుని ప్రేరణ పొందాలి. ఈ మహనీయుల ఆలోచనలు, త్యాగాలే భారతీయ జనతా పార్టీ సిద్ధాంత పునాదులు. అవి ప్రతి కార్యక్రమంలో, ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిగా నిలిచిందని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు జెండా కార్యక్రమంలో బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్. రవి ప్రసాద్ గౌడ్ పాల్గొనడం జరిగింది.

## శ్రీ భవానీ రామలింగేశ్వరునికి దివ్య స్పర్శ



**కీసర,విశాలభారతి :** కీసర గుట్టలోని శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం అరుదైన ఆధ్యాత్మిక దృశ్యం ఆవిష్కృతమైంది సాయంత్రం సూర్య భగవానుడు తన కిరణాలతో గర్భాలయంలోని శ్రీ స్వామివారిని తాకిన దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది.ఆలయ గర్భగుడిలోకి నేరుగా ప్రవేశించిన సూర్యకిరణాలు శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహాన్ని స్పర్శించడంతో ఆలయ ప్రాంగణం భక్తి నినాదాలతో మార్మోగింది."ఓం నమో భగవతే రామలింగాయ" అంటూ భక్తులు జపాలు చేస్తూ దివ్య క్షణాన్ని ఆస్వాదించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాటకం వెంకటేష్ శర్మ మాట్లాడుతూ సూర్య కిరణాలు స్వామివారిని తాకడం అత్యంత పవిత్రమైన దివ్య సంఘటనగా పేర్కొన్నారు.ప్రతి ఏడాది ఇలాంటి అరుదైన దర్శనం లభించడం భక్తులకు అదృష్టమని,ఈ సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు తరలి రావడం ఆనందదాయకమన్నారు.ఈ అరుదైన దృశ్యాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తి భావం వెల్లివిరిసింది.ఈ దివ్య దర్శనం పొందడం తమ అదృష్టమని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ,స్వామివారి ఆశీస్సులు పొందారు.

## డా. బాబు జగ్జీవన్ రామ్‌కి భారతరత్న ఇవ్వాలి



**సికింద్రాబాద్, విశాలభారతి:** భారత ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు, ఆధునిక భారతదేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన రాజకీయ దురంధరుడు, సుదీర్ఘకాలం పార్లమెంట్లో సభ్యుడిగా దేశ ప్రజలకు విశేషమైన సేవలు అందించిన యోధులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పార్సిగుట్ట లోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు జేపీ లత మాదిగ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నర్సింహ మాదిగ,అధకార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ, ఎం ఎస్ పి ఉప అధ్యక్షులు ఇటుక శ్రీకిషన్ మాదిగ, ఎంఎస్పి రాష్ట నాయకులు రాజు మాదిగ,విజయ్ రావు మాదిగ,ఎడ్ల రుద్రి మాదిగ,చెండేటీ వేణుగోపాల్ మాదిగ,దేవేందర్ మాదిగ,నాని మాదిగ,మురళిధర్ మాదిగ, సత్య నారాయణ మాదిగ,సత్యనారాయణ నేత,బోలు శ్రీనివాస్ హోలియా దాసరి,రవి మాదిగ,తుమ్మల శివ ప్రసాద్ మాదిగ,శ్రీనివాస్ మాదిగ,బాభేందర్,డప్పు మహేష్ మాదిగ, ఇతేపాక హరి మాదిగ తదతరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో ఘనంగాడాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

- మాదిగ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో ఐక్యతకు ప్రతీకగా భారీ ర్యాలీ
- దళిత అభ్యున్నతికి డాక్టర్ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ రామ్ సేవలకు ఘన నివాళి
- "జై డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్" నినాదాలతో భారీ ర్యాలీ
- మాదిగ జాతి ఐక్యతకు ప్రతీకగా కార్యక్రమం

**సత్తుపల్లి, విశాలభారతి:**



స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, పరిపాలనా దక్షతతో దేశానికి విశేష సేవలందించిన మాజీ ఉప ప్రధాని జయంతి సందర్భంగా సత్తుపల్లిలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని మాదిగ మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ నాయకులు, సామాజిక కార్యకర్తలు గౌరవ వందనం తెలిపారు. వక్తలు మాట్లాడుతూ, వెనుకబడిన దళిత జాతి మరియు అణగారిన వర్గాల హక్కుల సాధనలో బాబు జగజీవన్ రామ్ చేసిన కృషి అభివర్ణనీయమని కొనియాడారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని మాదిగ జాతి ఐక్యతను చాటిచెప్పేలా సిద్ధారం రోడ్డుదగ్గర నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ "జై జగ్జీవన్ " నినాదాలతో ఉత్సాహంగా సాగి, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు చేరింది. యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను ప్రదర్శించారు.పాల్గొన్న వారు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలు సత్తుపల్లిలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, మాదిగ జాతి ఐక్యతను మరింత బలపరిచిన సందర్భంగా నిలిచాయి.

## కీసర డివిజన్‌లో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్

- 2026 నిర్వహిస్తున్న సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్
- 12 గ్రామాల జట్లతో ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్
- యువతలో క్రీడా నైపుణ్యాల పెంపే లక్ష్యం.



**కీసర,విశాలభారతి :** కీసర డివిజన్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ 2026 క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు కర్రె గణేష్ తెలిపారు.కీసర డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకల సందర్భంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.అంబేద్కర్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లడం,వారిలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు.ఉమ్మడి కీసర మండలంలోని 12 గ్రామాల జట్లతో ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఏప్రిల్ 8, 9, 13 తేదీల్లో మ్యాచ్‌లు జరుగనున్నాయని,ఏప్రిల్ 8న ఉదయం 7 గంటలకు కీసర లెగసీ గ్రౌండ్‌లో టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలిపారు.టోర్నమెంట్‌లో భాగంగా కీసర లెగసీ గ్రౌండ్‌లో కీసరకీసర దాయర, యాద్గార్‌పల్లి–అంకిరెడ్డి పల్లి, రాంపల్లి–చిర్యాల్ జట్ల మధ్య పోటీలు జరుగుతాయని, అలాగే కీసర 7T గ్రౌండ్‌లో కుందనపల్లి–తిమ్మాయిపల్లి, బండ్లగూడ–నాగారం జట్ల మధ్య మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ టోర్నమెంట్‌ను తాళ్ల కిరణ్,ఎంకరాల నర్సింగ్ రావు ఆర్గనైజర్స్‌గా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి సంజీవ,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం బౌద్ధ నగర్ నూతన కమిటీ ఎన్నిక



**సికింద్రాబాద్, విశాలభారతి:** సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన ఆధ్వర్యంలో బౌద్ధ నగర్ డివిజన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. డివిజన్ పరిధిలోని అంబర్ నగర్ ఏకశిలా మెడికల్ హాల్ వద్ద ఉన్న పద్మశాలి సంఘంలో కమిటీని సికింద్రాబాద్ అధ్యక్షుడు మందు జగన్ ప్రకటించారు. ఆద్యక్షలుగా అనందాను. కథకర్ ఉపాద్యక్షలుగా చింతకింది సాయికిరణ్ ప్రధాన కారదర్శిగా తాట్టం. ప్రతిష్ కోషాదికారిగా . తిరుము. రవి , వర్కింగ్ ప్రెసిండిట్ కర్ణా టి. ఆనంద్ కుమార్, కార్మ దర్శగా దిండిగల. శ్రీకాంత్ తదితరులు ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు చింతకింది. మల్లేష్, ఆరుమల. సంతోష్, శాగిమల దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళులు



**సికింద్రాబాద్, విశాలభారతి :** సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని కృషిచేసిన సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని బిజెపి ఓబీసీ మోర్చా నిజాంపేట్ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించారు.

## బుద్వేల్‌లో ఘనంగా ఈస్టర్ వేడుకలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** క్రైస్తవుల పవిత్ర పండుగ అయిన ఈస్టర్ సందర్భంగా బుద్వేల్ పరిధిలో వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ ఎమ్మెల్యే రత్నం గారితో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన క్రైస్తవ సోదర సోదరీమణులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**సికింద్రాబాద్, విశాలభారతి :** బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్ట చౌరస్తా లో ఆ మహనీయుని విగ్రహానికి బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకలకీర్తి హర్షకిరణ్ ఘన నివాళులు అర్పించడం జరిగినది. సామాజిక సమానత్వం కోసం, పేదల అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడు బాపు జగ్జీవన్ రామ్ గారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడిగా, శక్తివంతమైన నాయకుడిగా, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన సేవలు చిరస్మరణీయం. ఆయన ఆలోచనలు, సేవా స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం ,వారి ఆశయాల సాధనల కోసం మేము నిరంతరం కృషి చేస్తామని కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ తెలిపారు.ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, సీనియర్ నాయకులు హనుమంతు ముదిరాజ్ ,కొమ్రయ్య, సాయ దత్తు , గుండ్రపల్లి శ్రీనివాస్,సత్యనారాయణ,శ్యామ్ ముదిరాజ్, సతీష్ నేత, బైరి సురేష్ అమరవతి ,బాలయ్య, వనమాల శ్రీనివాస్ , క్రాంతి, బీ జే వైఎం నాయకులు సాయి ముదిరాజ్, విజయ్ లాల్ , మహిళా నాయకురాళ్లు నాగరాణి, సరిత గౌడ్,యాదమ్మ, ప్రమీల,వాణి, మమత పాల్గొన్నారు.




## బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడు



**పాల్వంచ విశాలభారతి:**

సంఘ సంస్కర్తగా, దళితుల పక్షపాతిగా బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు నేటితరానికి ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. భారత తొలి దళిత ఉప ప్రధానమంత్రి, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతిని ఆదివారం స్థానిక బస్ స్టాండ్ సెంటర్ నందు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ నిర్మాణం కమిటీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సాబీర్ పాషా తొలుత జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యదయానికి అహర్నిశలు కృషి చేశారని, మహాణీయుల్లో జగ్జీవన్ రామ్ ప్రముఖుడన్నారు. భారతదేశ తొలి ఉప ప్రధాన మంత్రిగా నిస్వార్ధంగా సేవలందించారని, మచ్చలేని నాయకుడిగా పేరు సంపాదించుకున్నాడన్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్లమెంటేరియన్‌గా ప్రజల పక్షాన వారి గళాన్ని వినిపించి ప్రజలు, నిమ్నజాతి సంక్షేమకోసం అహర్నిషలు కృషి చేశారన్నారు. అసమానతలు లేని సమాజ స్థాపనకోసం జగ్జీవన్ రామ్ పరితపించాడని అన్నారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా దేశ ప్రజలు బాబూజీగా నామకరణం చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని కులరక్కసిని పారద్రోలేందుకు కృషి చేయాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, నాయకులు ఎస్‌ఏ రెహమాన్, ఆవుల సతీష్, ఆలపాటి ప్రసాద్, నరేంద్ర, రామారావు, సంజీవరావు, వెంకటేష్, దినేష్, నరేష్, పండు, వెంకటరత్నం, రాజేష్, జిలానీ, రమేష్, బాలాజీ, తులసి రామ్, బాబురావు, కోమటి శ్రీను, అల్లి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు కాల్వ భాస్కర్, కొత్తపల్లి సోమయ్య, దండోర శ్రీను, కత్తి శ్రీను, సందీప్, దేవీలాల్, రమేష్ నాయక్, కాల్వ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**రాజేంద్రనగర్, విశాలభారతి:** స్వాతంత్ర్య సమరయోధుడిగా, సమాజ సంస్కర్తగా, తన పరిపాలనా దక్షతతో దేశ అభివృద్ధికి విశేష సేవలు అందించిన మాజీ ఉప ప్రధాని జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా శంషాబాద్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని శంషాబాద్ మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, ఆయన దేశానికి చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సమరంలో చురుకైన పాత్ర పోషించిన జగ్జీవన్ రామ్, అనంతరం కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ దేశ పరిపాలనలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని వక్తలు పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ గౌడ్, మాజీ PACS చైర్మన్ మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కుమార్, అజయ్, నందు, అంజద్, మురళి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా జగ్జీవన్ రామ్ సేవలను స్మరించి నివాళులు అర్పించారు. చివరగా పాల్గొన్న వారందరూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించారు.



విశాల భారతి


# కాలినడకన అన్ని మెట్లూ ఎక్కాల్సిందే

## తిరుమల దర్శనంపై జాన్వీకపూర్

తెలుగులో కూడా సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్నభామల్లో టాప్‌లో ఉంటుంది జాన్వీకపూర్. భక్తి భావం ఎక్కువున్న బాలీవుడ్ ముద్దుగుమ్మల జాబితాలో కూడా ముందు వరుసలో ఉంటుంది. దివంగత అందాల తార శ్రీదేవి అడుగుజాడల్లో నడుస్తూ అభిమానులు, ఫాలోవర్లకు తల్లికి తగ్గ తనయగా ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తూ ఉంటుంది. సాధారణంగా సెలబ్రిటీలు ప్రఖ్యాత ఆలయాలను సందర్శించాలంటే వీఐపీ దర్శనం సౌకర్యం రెడీగా ఉంటుందని తెలిసిందే. ప్రత్యేకించి ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం ఎంతోమంది సెలబ్రిటీలు వీఐపీ దర్శనం ద్వారా వెళ్తుంటారు. కానీ జాన్వీకపూర్ మాత్రం తనకు సులువుగా దేవుడిని దర్శించుకునే అవకాశమున్నప్పటికీ ఆ మార్గాన్ని వద్దనుకోవడం విశేషం. జాన్వీకపూర్ ఎప్పుడూ చూసినా మెట్ల మార్గం గుండా వెళ్లి దేవుడిని దర్శించుకోవడం చూస్తూనే ఉంటాం. ఎప్పుడు తిరుపతికి వెళ్లినా సాధారణ ప్రజల్లాగే కాలినడకన వెళ్లి తిరుమలేశుడిగా దర్శించుకుంటే గానీ ఈ భామకు సంతృప్తి కలగదట. ఇదే విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం ఒక్కసారి లభించినా చాలని భక్తులు గంటల తరబడి ఎలా వేచి ఉంటారో నాకు బాగా తెలుసు. నాకు అలాంటి సమయం దొరకడం పట్ల ఎంతో అదృష్టవంతురాలిగా భావిస్తా. ఏదేమైనా సరే నేను ప్రతిసారీ ఆ 3500 మెట్లనూ ఎక్కితే తప్ప, నా దర్శనం పరిపూర్ణమైనట్లు నాకు అనిపించదు. నేను కేవలం నేరుగా వెళ్లి దర్శనం చేసుకుని రాలేను. ఆ మెట్లన్నీ ఎక్కినప్పుడే నా దర్శన యాత్ర సంపూర్ణమైనట్లుగా భావిస్తానంటూ చెప్పుకొచ్చింది' జాన్వీకపూర్. ఈ బ్యూటీ తను ఓ సెలబ్రిటీని అని ఏమాత్రం గర్వం లేకుండా ఇలా ప్రతీసారి కాలినడకన ఒక్కో మెట్టు ఎక్కి ప్రజల నుంచి అభిమానులను ప్రశంసలు అందుకుంటోంది. దేవుడి ముందు అందరూ సమానమే అని చెప్పకనే చెబుతూ ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. జాన్వీకపూర్ ప్రస్తుతం రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న పెద్దిలో ఫీ మేల్ లీడ్ రోల్ చేస్తోంది. దేవరతో తెలుగు డెబ్యూ ఇచ్చిన జాన్వీకపూర్‌కు తెలుగులో పెద్ది రెండో సినిమా.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.